epaper.samayamdaily.net
APTEL/2006/18267
# సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 135 | ఎడిటర్ : విక్రం కుమార్ | మంగళవారం 17 మార్చి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |



# విజన్ 2047

## లక్ష్యం 3 ట్రిలియన్ డాలర్లు

- అసెంబ్లీలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా దిశానిర్దేశం
- దేశ జీడీపీకి 4.99 శాతం వాటా ఇస్తున్న తెలంగాణ..
- ఉభయ సభలను ఉద్దేశించి తెలుగులో ప్రసంగం

**హైదరాబాద్, మార్చి 16:** ప్రతి పౌరుడిని అభివృద్ధిలో భాగస్వామిని చేస్తూ, ప్రజా సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర బడ్జెట్ రూపకల్పన చేసినట్లు తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రకటించారు. సోమవారం ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఉభయ సభలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తొలుత తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించిన గవర్నర్, 'విజన్ 2047' ద్వారా తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశ జీడీపీకి తెలంగాణ 4.99 శాతం వాటా అందిస్తోందని, తలసరి ఆదాయం రూ. 4.18 లక్షలకు చేరిందని ఆయన వెల్లడించారు. ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానంగా మారిందని, గ్లోబల్ సమ్మిట్ ద్వారా రూ. 5.72 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం క్యూర్, ప్యూర్, రేర్ అనే వినూత్న నమూనాలను అనుసరిస్తోందని గవర్నర్ వివరించారు.

మిగతా 2 లో

“ప్రతిపౌరుడు అభివృద్ధిలో భాగస్వామిగా ఉండేలా బడ్జెట్‌ను రూపొందించినట్లు గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. 2047 తెలంగాణ రైజింగ్ దిశగా అడుగులు వేస్తున్నట్లు గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. అసెంబ్లీలో తొలిసారి తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఆపై గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉభయసభలను ఉద్దేశించి తెలుగులో ప్రసంగించారు. తొలుత గవర్నర్ తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించడంవిశేషం. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యమని గవర్నర్ పేర్కొన్నారు.

## శాసనసభ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం

లాంఛనంగా ప్రారంభించిన గవర్నర్ శుక్లా
పుష్పాంజలి ఘటించిన గవర్నర్, సీఎం, మంత్రులు

2



## 31 వరకు అసెంబ్లీ

- 20న సభల బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి
- ఉగాది, రంజాన్, శ్రీరామనవమికి సెలవులు
- బీఏసీ సమావేశంలో నిర్ణయం

2



పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ

# ఓ చరిత్ర

స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్‌గా నామకరణం

- అహింసా మార్గంలో ఆంధ్ర రాష్ట్ర సాధనకు కృషి
- 58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల విగ్రహం
- అమరావతిలో ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

**అమరావతి, మార్చి 16(మనసులో మాట):** అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు విగ్రహా విష్కరణ ఒక చరిత్ర అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణిం చారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్‌గా నామ కరణం చేశామని చెప్పారు. అహింసా మార్గంలో ఆయన ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. పొట్టి శ్రీరాముల త్యాగం ఈ తరం వాళ్లు తెలుసుకోవాలన్నారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో అమరజీవి పొట్టి శ్రీరాముల 58 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల

మిగతా 5 లో



4

## అన్ని రాష్ట్రాల్లోనూ గ్యాస్ నిల్వలు

వంట గ్యాస్ సరఫరాపై కేంద్రం కీలక ప్రకటన

## యుద్ధం వేళ చైనా దూకుడు

తైవాన్ దిశగా యుద్ధనౌకలు, విమానాల మోహరింపు



4



## ఆరేళ్ల బాలికపై లైంగికదాడి హత్య

చాక్లెట్ ఆశచూపి చిన్నారిని తీసుకెళ్లిన కామాంధుడు..

సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితుడి అరెస్ట్

2 లో..

హైదరాబాద్ నగర శివార్లలోని నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యంత హేయమైన ఘటన వెలుగులోకి వచ్చింది. మానవత్వాన్ని మంటగలుపుతూ ఆరేళ్ల పసిగుడ్డుపై ఓ కామాంధుడు అత్యాచారానికి పాల్పడి, ఆపై గొంతు నులిమి దారుణంగా హత్య చేశాడు.

## నందిని సిధారెడ్డికి 'కేంద్ర సాహిత్య అకాడమీ' అవార్డు

- 'అనిమేష' కవితా సంపుటికి దక్కిన గౌరవం..
- సాహితీవేత్తలు, కేసీఆర్, కేటీఆర్ హర్షం

2



## ఫలక్‌నుమాలో భారీ అగ్నిప్రమాదం



- సోఫాల తయారీ కేంద్రం దహనం
- ఫరూఖ్‌నగర్ బస్‌డిపో సమీపంలో చెలరేగిన మంటలు..
- ఇతర దుకాణాలకు వ్యాప్తి

2

## సమావేశాలకు ఎమ్మెల్యేలు హాజరు కావాల్సిందే

- ప్రతిపక్షాల ప్రశ్నలకు దీటుగా సమాధానం ఇవ్వాలి..
- సీఎల్పీ సమావేశానికి గైర్హాజరైన వారిపై ముఖ్యమంత్రి సీరియస్

2





3

## తెలుగు రాష్ట్రాలకు వర్షసూచన

- సిద్దిపేట జిల్లాలో వడగళ్ల వాన



## రేపు రాష్ట్రవ్యాప్తంగా ఫార్మర్ కిట్స్

**పంపిణీని ప్రారంభించనున్న మంత్రి తుమ్మల**

**హైదరాబాద్, మార్చి 16:** రాష్ట్రంలోని ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రోత్సాహకంగా ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన రైతులకు 'ఫార్మర్ కిట్స్' పంపిణీ చేసే కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర సచివాలయం నుండి లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 489 క్లస్టర్లలో ఈ పంపిణీ జరుగుతుంది. ప్రతి క్లస్టర్‌కు 125 మంది చొప్పున, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 61,125 మంది రైతులకు ఈ కిట్లను అందజేయడం జరుగుతుంది. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, గుర్తింపు కోసం ఈ కిట్‌లో క్లాత్ బ్యాగ్, క్షేత్ర దర్శిని డైరీ, గుర్తింపు కార్డు, ప్రత్యేక క్యాలెండర్, టోపీ, పెన్ను మరియు చిన్న ప్యాకెట్ డైరీ వంటి వస్తువులు ఉంటాయి. సచివాలయంలో మంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం, ఆయా జిల్లాల్లోని రైతు వేదికలలో స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా రైతులకు ఈ కిట్లను పంపిణీ చేస్తారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు.

## జనాభా ప్రాతిపదికన బీసీలకు బడ్జెట్ కేటాయింపులు

**డిప్యూటి సీఎం భట్టితో బీసీ మంత్రుల భేటీ**

**హైదరాబాద్, మార్చి 16:** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఛాంబర్‌లో కాంగ్రెస్ బీసీ ఎమ్మెల్యేలు సోమవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మహేష్ గౌడ్, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీలకు జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపులపై చర్చించారు. బీసీ ప్రైవేట్ బిల్‌పై కూడా చర్చ జరిగింది. తెలంగాణ బ్జడెట్ సమావేశాల నేపథ్యంలో సీఎల్పీ సోమవారం సమావేశం అయింది. సమావేశం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతలకు దిశా నిర్దేశర చేశారు. అసెంబ్లీ సమావేశాలకు సభ్యులంతా తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. ఏదో ఒక సాకు చెప్పి సభ్యులు గైర్హాజరు కావద్దని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు వివిధ అంశాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. సీఎల్పీకి పలువురు ఎమ్మెల్యేలు హాజరు కాకపోవడంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియాతో చిట్‌చాట్‌లు చేయవద్దన్నారు.

## తెలుగు రాష్ట్రాలకు వర్షసూచన

**హైదరాబాద్,మార్చి16 :** తెలంగాణలోని పలు ప్రాంతాల్లో సోమవారం వడగళ్ల వర్షం కురిసింది. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలోని పలు గ్రామాలను వడగళ్ల వాన వణికించింది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ఉరుములు, మెరుపులతో వడగళ్ల వర్షం కురిసింది. పట్టణంతో పాటు డివిజన్ వ్యాప్తంగా జరాసంఘం, కోహిర్, న్యాల్కల్, రాయికోడ్ మండలాల్లో వర్షపు జల్లులు పడ్డాయి. ఇదిలావుంటే తెలుగు రాష్ట్రాలకు భారత వాతావరణ శాఖ వర్ష సూచన చేసింది. మహారాష్ట్ర నుంచి కర్ణాటక మీదుగా తమిళనాడు వరకు ద్రోణి కొనసాగుతుందని వివరించింది. అందువల్ల భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. సోమవారం నుంచి వచ్చే నాలుగు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలంగాణలో ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్, హైదరాబాద్, నల్గొండ, నిజామాబాద్ జిల్లాల్లో సోమ, మంగళ, బుధవారాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తాయని ఐఎండీ తెలిపింది. ఈ క్రమంలోనే సోమవారం కామారెడ్డి జిల్లాలోని జుక్కల్ మండలం హంగర్గ గ్రామంలో వడగండ్ల వాన కురవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. మరోవైపు హైదరాబాద్‌లో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రాత్రి సమయంలో నగరంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇదిలా ఉంటే.. ఆంధ్రప్రదేశ్‌లో రానున్న రెండు రోజుల్లో పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. అలాగే, కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్, రాయలసీమలోని నంద్యాల, కర్నూల్, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పలు చోట్ల వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. మరోవైపు అల్లూరి, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమలతోపాటు ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ఈ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది.

## ఆరేళ్ల బాలికపై లైంగికదాడి హత్య

**చాక్లెట్ ఆశచూపి చిన్నారిని తీసుకెళ్లిన కామాంధుడు..**

**సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితుడి అరెస్ట్**

**హైదరాబాద్, మార్చి 16:** హైదరాబాద్ నగరంలోని నార్సింగిలో దారుణం చోటుచేసుకుంది. ఓ కామాంధుడు.. ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేశాడు. చాక్లెట్ ఇప్పిస్తానంటూ బాలికను నమ్మించి అత్యాచారం చేసి ప్రాణాలు తీశాడు. చిన్నారి ఆదివారం సాయంత్రం నుంచి కనిపించకపోవడంతో రాత్రి 10 గంటలకు నార్సింగి పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్‌లో బాలికను కామాంధుడు తీసుకెళ్తున్న దృశ్యాలను గుర్తించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో గుండెల్ని పిండేసే ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. మానవత్వం అనే విషయాన్ని మంట కలుపుతూ కేవలం ఆరేళ్ల వయసున్న ఓ చిన్నారిపై అత్యాచారం చేసి, ఆపై గొంతు నులిమి హత్య చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. సమాచారం మేరకు నార్సింగిలో నివసించే ఆరేళ్ల బాలిక ఆదివారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటూ ఉంది. అయితే ఉనట్లుంది కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో, ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెంటనే నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చిన్నారి అదృశ్యంపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రంగంలోకి దిగిన పోలీసులు బాధితురాలి ఇంటి పరిసరాల్లో ఉన్న సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. ఈ క్రమంలో ఒక వ్యక్తి బాలికకు చాక్లెట్ ఇప్పిస్తానని నమ్మించి, తన వెంట తీసుకువెళ్తున్న దృశ్యాలు రికార్డయ్యాయి. ఈ ఆధారాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి, కొద్దిసేపటికే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు తన దారుణానికి పాల్పడినట్లు అంగీకరించాడు. బాలికపై లైంగిక దాడికి పాల్పడి, ఆపై ఎక్కడ దొరికిపోతానో అన్న భయంతో ఆమెను దారుణంగా హత్య చేసినట్లు తెలిపాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో నిందితుడు చూపిన ప్రాంతంలో పోలీసులు బాలిక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

# విజన్ 2047.. లక్ష్యం 3 ట్రిలియన్ డాలర్లు

మొదటి పేజీ తరువాయి

పట్టణాభివృద్ధిలో భాగంగా జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా, హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని నాలుగు కమిషనరేట్లుగా విభజించామన్నారు. మూసీ నది ప్రక్షాళనకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని, మొదటి దశలో హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు పనులు చేపడతామని తెలిపారు. అలాగే రీజినల్ రింగ్ రోడ్డు చుట్టూ ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తామని, ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ పోర్టు వరకు గ్రీన్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మిస్తామని పేర్కొన్నారు. ఐటీ రంగంలో రాష్ట్రం అద్భుత ప్రగతి సాధించిందని, ఎగుమతులు రూ. 3.13 లక్షల కోట్లకు చేరి 9.39 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయని తెలిపారు. సంక్షేమ రంగంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ, ఇల్లు లేని పేదల కోసం 4 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు గవర్నర్ వెల్లడించారు. రైతు భరోసా కింద రూ. 9,000 కోట్లు, పంట రుణమాఫీ కోసం రూ. 20,616 కోట్లు వెచ్చించామన్నారు. మహిళా సాధికారత కోసం స్వయం సహాయక సంఘాలకు రూ. లక్ష కోట్ల రుణాలు అందించేలా ప్రణాళికలు రూపొందించామని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ. 9,222 కోట్లు ఆదా అయ్యాయని చెప్పారు. విద్యా రంగంలో సంస్కరణల కోసం అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూల్స్, నిరుద్యోగుల కోసం రికార్డు సమయంలో 67,763 ఉద్యోగాల భర్తీ చేపట్టామన్నారు. గవర్నర్ ప్రసంగం సమయంలో బీఆర్ఎస్ సభ్యులు ఆరు గ్యారెంటీల అమలుపై నిరసన వ్యక్తం చేసినప్పటికీ, ఆయన తన ప్రసంగాన్ని కొనసాగించి రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికను సభ ముందు ఉంచారు.



# శాసనసభ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం

**లాంఛనంగా ప్రారంభించిన గవర్నర్ శుక్లా**

**పుష్పాంజలి ఘటించిన సీఎం, మంత్రులు**

**హైదరాబాద్, మార్చి 16:** శాసనసభ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. పునరుద్ధరించిన మండలి భవనం ముందు తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రాష్ట్ర శాసనసభ ఆవరణలో రాష్ట్ర ఆత్మగౌరవ చిహ్నంగా నూతనంగా రూపొందించిన 'తెలంగాణ తల్లి' విగ్రహాన్ని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా వైభవంగా ఆవిష్కరించారు. ఈ చారిత్రక ఘట్టం రాష్ట్ర ప్రముఖులు, మంత్రుల సమక్షంలో అత్యంత వేడుకగా జరిగింది. అనంతరం విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముందు ఒక ప్రత్యేక కార్యక్రమం జరిగింది. అసెంబ్లీ ఆవరణలో ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాల వద్ద గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఘనంగా నివాళులర్పించారు. దేశానికి, సమాజానికి వారు చేసిన అసమాన సేవలను ఈ సందర్భంగా నేతలు స్మరించుకున్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను ఉద్దేశించి మాట్లాడారు. ఈ విగ్రహం కేవలం ఒక నిర్మాణం మాత్రమే కాదని, ఇది తెలంగాణ ప్రజల పోరాట పటిమకు, సంస్కృతికి, ఆత్మగౌరవానికి నిలువెత్తు ప్రతీక అని ఆయన అభివర్ణించారు. రాష్ట్ర అస్తిత్వాన్ని ప్రతిబింబించేలా ఈ విగ్రహాన్ని తీర్చిదిద్దినట్లు ఆయన పేర్కొన్నారు.



# 31 వరకు అసెంబ్లీ

**20న సభల బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి**

**ఉగాది, రంజాన్, శ్రీరామనవమికి సెలవులు**

**బీఏసీ సమావేశంలో నిర్ణయం**

**హైదరాబాద్, మార్చి 16:** తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 31 వరకు జరగనున్నాయి. ఈ మేరకు బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షత బీఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశాల నిర్వహణపై కీలక నిర్ణయం తీసుకున్నారు. మార్చి 16 నుంచి మార్చి 31 వరకు సమావేశాలను నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. సోమవారం ఉదయం గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగంతో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం అనంతరం స్పీకర్ సభను మంగళవారం వాయిదా వేశారు. అనంతరం స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై చర్చించారు. మార్చి 17, 18న గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. ఈనెల 20న అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెను ప్రవేశపెట్టనుంది. ఆపై 23 నుంచి 26 వరకు బడ్జెట్‌పై చర్చలు జరపనున్నారు. మార్చి 31న ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ జరగనుంది. అలాగే ఉగాది, రంజాన్, శ్రీరామనవమికి అసెంబ్లీకి సెలవులు ప్రకటించనున్నారు. బీఏసీ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, విప్ బీర్ల ఐలయ్య హాజరయ్యారు. బీఆర్ఎస్ నుంచి హరీశ్ రావు, కేపీ వివేక్ హాజరవగా.. బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి, ఎంఐఎం నుంచి అక్బరుద్దీన్, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు సమావేశంలో పాల్గొన్నారు.

# సమావేశాల్లో ఎమ్మెల్యేలు హాజరు కావాల్సిందే

- **ప్రతిపక్షాల ప్రశ్నలకు దీటుగా సమాధానం ఇవ్వాలి..**
- **సీఎల్పీ సమావేశానికి గైర్హాజరైన వారిపై ముఖ్యమంత్రి సీరియస్**


**హైదరాబాద్, మార్చి 16:** శాసనసభ సమావేశాలకు సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని పార్టీ ఎమ్మెల్యేలను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వివిధ అంశాలపై ఎమ్మెల్యేలు అవగాహన పెంచుకోవాలని, వారికి మంత్రులు సమయమివ్వాలని సూచించారు. తెలంగాణ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో సీఎల్పీ సమావేశమైంది. ఈ సందర్భంగా పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపై సమాధానం ఇచ్చేందుకు పూర్తి సమాచారం దగ్గర ఉంచుకోవాలన్నారు. ఏదో ఒక సాకుతో సభ్యులు సభకు గైర్హాజరు కావొద్దన్నారు. సీఎల్పీకి పలువురు ఎమ్మెల్యేలు హాజరు కాకపోవడంపై సీఎం సీరియస్ అయ్యారు. సీఎల్పీకి రాలేనంత బిజీగా ఉన్నారా అని ప్రశ్నించారు. మీడియాతో చిట్‌చాట్‌లు చేయవద్దన్నారు. ప్రజా ప్రభుత్వంలో మూడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నామని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ప్రాధాన్యం, భవిష్యత్ ప్రణాళికలకు సంబంధించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా తన ప్రసంగంలో వివరించారని తెలిపారు. గవర్నర్ ప్రసంగం రాష్ట్ర ప్రభుత్వానికి రోడ్ మ్యాప్ లాంటిదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించాల్సిన సమయం అయిపోయిందని అన్నారు. ప్రభుత్వ భవిష్యత్ ప్రణాళికలు, ప్రజలకు ఏం చేయబోతున్నామనే విషయంపై దృష్టి సారించాలని సూచించారు. సభలో మాట్లాడే అంశాలపై ప్రభుత్వ విప్‌ల మధ్య సమన్వయం ఉండాలని ఆదేశించారు. సభలో చర్చ పక్కదారి పట్టకుండా, సభా సమయం వృథా కాకుండా సమర్థవంతంగా నడిపేలా చూడాలని దిశానిర్దేశర చేశారు. కేసీఆర్ హయాంలో.. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడటానికి తమకు సమయం ఇవ్వలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. సీఎల్పీ నేతగా ఉన్న మల్లు భట్టి విక్రమార్కకు, జానారెడ్డికి కూడా మైక్ ఇవ్వలేదని ఆగ్రహించారు. సెషన్ మొత్తం సస్పెండ్ చేసి ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు తనను సభకు రాకుండా చేశారని ధ్వజమెత్తారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో హాజరు విషయంలో ఎమ్మెల్యేలు నిర్లక్ష్యం వహించొద్దని హుకుం జారీ చేశారు. మహిళా శాసన సభ్యులు హాజరుతో పాటు చర్చల్లో పాల్గొనాలని మార్గనిర్దేశర చేశారు. సభా చర్చల్లో మహిళా సభ్యుల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ఇది మన ప్రభుత్వం.. ఇప్పుడు మనం వేసుకునే రోడ్ మ్యాప్‌నే వచ్చే ఎన్నికలకు అజెండా అవుతుందని అన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యపై ఫోకస్ పెట్టాలని ఆదేశించారు. 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిందేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.అసెంబ్లీ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర రాష్ట్రాల్లో పర్యటించి పలు సమస్యలు, ఆయా ప్రభుత్వ విధానాలను అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేశారు. రాజకీయాల్లో వ్యక్తిగత డ్యామేజీ ఉండదని.. ఆది వ్యవస్థ మొత్తాన్ని డ్యామేజ్ చేస్తోందని అన్నారు. వ్యవస్థను నిలబెట్టుకుంటేనే రాజకీయాల్లో మనుగడ ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ, ప్రభుత్వ పరమైన లైన్‌లోనే అందరూ స్పందించాలని సూచించారు.



## ఫలక్‌నుమాలో భారీ అగ్నిప్రమాదం

**సోఫాల తయారీ కేంద్రం దహనం**

**హైదరాబాద్, మార్చి 16:** నగరంలోని ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఫరూఖ్‌నగర్ బస్‌డిపో సమీపంలో ఉన్న ఒక సోఫాల తయారీ కేంద్రంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్మేసింది. ఈ ప్రమాదంలో తయారీ కేంద్రంతో పాటు పక్కనే ఉన్న ఫర్నిచర్ దుకాణం, మరికొన్ని చిన్న షాపులకు మంటలు వేగంగా వ్యాపించాయి. తయారీ కేంద్రంలో సోఫాల తయారీకి ఉపయోగించే ఫోమ్, చెక్క సామగ్రి, ఇతర రసాయనాలు ఉండటంతో మంటలు నిమిషాల వ్యవధిలోనే ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. ఈ ఘటనతో స్థానిక వ్యాపారులు, నివాసితులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫోమ్ వంటి పదార్థాల వల్ల మంటలు అదుపులోకి రావడం కష్టతరంగా మారినప్పటికీ, అగ్నిమాపక యంత్రాలతో సిబ్బంది శ్రమించి మంటలను నియంత్రించే ప్రయత్నం చేశారు. స్థానికులు కూడా అప్రమత్తమై కొన్ని దుకాణాల నుంచి విలువైన వస్తువులను బయటకు తరలించడంతో ప్రాణనష్టం తప్పింది. అయితే, దుకాణాల్లోని సోఫాలు, ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమవడంతో భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగి ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.





# నందిని సిధారెడ్డికి 'కేంద్ర సాహిత్య అకాడమీ' అవార్డు

**'అనిమేష' కవితా సంపుటికి దక్కిన గౌరవం..**

**సాహితీవేత్తలు, కేసీఆర్, కేటీఆర్ హర్షం**

**హైదరాబాద్, మార్చి 16:** ప్రముఖ తెలంగాణ కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు నందిని సిధారెడ్డికి 2025 సంవత్సరానికి గానూ ప్రతిష్ఠాత్మక 'కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు' లభించింది. ఆయన రచించిన 'అనిమేష' అనే కవితా సంపుటిని ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపిక చేశారు. కరోనా కాలంలో ప్రపంచం ఎదుర్కొన్న సామాజిక, ఆర్థిక సంక్షోభాలను, ముఖ్యంగా మానవ సంబంధాల విచ్ఛిన్నతను ఆయన ఈ సంపుటిలో అత్యంత హృద్యంగా చిత్రించారు. వలస కూలీల కష్టాలు, సమాజంలో నెలకొన్న ఒంటరితనం మరియు ఆందోళనలను అక్షరబద్ధం చేస్తూ ఆయన రాసిన కవిత్వం ఒక కాలానికి దర్పణంగా నిలిచిందని సాహితీవేత్తలు కొనియాడుతున్నారు. కేవలం అక్షరాల కూర్పుగా కాకుండా, సామాజిక కలతలను ప్రతిబింబించే ప్రేరణాత్మక రచనగా 'అనిమేష' నిలిచిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నందిని సిధారెడ్డి



సాహితీ ప్రస్థానం తెలంగాణ ఉద్యమంతో విడదీయలేనిది. మెదక్ జిల్లా కేంద్రంగా ఆయన స్థాపించిన 'మంజీరా రచయితల సంఘం' తెలుగు సాహిత్యంలో ఒక నూతన వాణిని వినిపించడమే కాకుండా, ఎందరో వర్ధమాన కవులకు వేదికైంది. 'నాగేటి సాల్లల్ల నా తెలంగాణ' వంటి పాటల ద్వారా తెలంగాణ పల్లె జీవనాన్ని, అస్తిత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ఆయన, మలిదశ ఉద్యమంలో తన పాటలు మరియు కవిత్వంతో ప్రజలను చైతన్యపరచడంలో కీలక పాత్ర పోషించారు. ఉద్యమ కవిగా ఆయన రచనలు రాష్ట్ర సాధన ఆకాంక్షను బలోపేతం చేయడమే కాక, ప్రజల సమస్యలకు గొంతుకగా నిలిచాయి. రాష్ట్రం సిద్ధించిన తర్వాత తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి, ప్రాచీన మరియు ఆధునిక సాహిత్య వికాసానికి ఆయన విశేష కృషి చేశారు. సిధారెడ్డికి ఈ గౌరవం దక్కడం పట్ల రాజకీయ, సాహితీ రంగాల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆయనను అభినందిస్తూ, తెలంగాణ మట్టి వాసన తెలిసిన కవికి ఈ గౌరవం దక్కడం గర్వకారణమని పేర్కొన్నారు. కరోనా కాలంలోని మానవ వేదనను అద్భుతంగా చిత్రించిన 'అనిమేష'కు ఈ గుర్తింపు రావడం సముచితమని ఆయన కొనియాడారు. అదేవిధంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ, సిధారెడ్డి తన శక్తివంతమైన కలం ద్వారా తెలంగాణ అస్తిత్వాన్ని ప్రపంచానికి చాటారని, ఆయన సాహిత్య ప్రస్థానానికి దక్కిన గొప్ప గౌరవం ఇదని అభివర్ణించారు. తెలుగు సాహితీ రంగానికి ఆయన చేసిన విశిష్ట సేవలు మరువలేనివని, ఈ పురస్కారం యావత్ తెలంగాణకు దక్కిన గౌరవమని అభినందనలు తెలిపారు.

# క్యూర్ పరిధిలో మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు

- అర్హులకే ఇళ్లు, అక్రమార్కులకు చెక్
- నివాసంలో లేని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు నోటీసులు
- ఏప్రిల్ 30వరకు గడువు
- అనర్హుల స్థానంలో అర్హులకు కేటాయిస్తాం
- క్యూర్ పరిధిలో హౌసింగ్‌పై మంత్రులు శ్రీధర్‌బాబు, అజారుద్దీన్, పొన్నంతో మంత్రి పొంగులేటి సమీక్ష



**హైదరాబాద్, మార్చి 16:** హైదరాబాద్,రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మాణానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో నివసించే పేద ప్రజల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా స్థలాలను గుర్తించాలని సూచించారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచనలకు అనుగుణంగా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని దీనికి తగ్గట్టుగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో సహచర మంత్రులు శ్రీధర్ బాబు, అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి క్యూర్ ఏరియాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, డబుల్ బెడ్ రూం ఇళ్ల పై సమీక్షా సమావేశం నిర్వహించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు, అలాగే డబుల్ బెడ్ రూం ఇళ్లకు పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక ఉండాలని ఎలాంటి రాజకీయ వత్తిళ్లకు తలొగ్గవద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు పొంది వాటిలో నివసించకుండా అ÷-దదెకు ఇస్తున్నవారికి, ఏళ్ల తరబడి తాళాలు వేసి ఖాళీగా ఉంచుతున్నవారికి నోటీసులు జారీ చేయాలని , నోటీసులకు స్పందించని వారి ఇళ్లను రద్దు చేసి అర్హులైన పేదలకు కేటాయించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ఎంతమందికి నోటీసులు ఇచ్చారు, ఎంతమంది స్పందించారు అక్కడ నివాసం ఉండకపోవడానికి వారు చెప్పిన కారణాలపై ఆరా తీశారు. 2 బిహెచ్‌కే, జెఎన్ ఆర్.ఎమ్ తదితర పథకాల్లో ఇళ్లు పొంది నివాసం ఉండని ఇళ్లను మే 1వ తేదీ నుంచి పరిశీలించాలని అటువంటి వారికి నోటీసులు ఇచ్చి, స్పందించని పక్షంలో కేటాయింపులను రద్దు చేయాలని స్పష్టం చేశారు. నోటీసులపై స్పందించిన లబ్దిదారుల నుంచి బాండు పేపరుపై తాము ఇక్కడే నివాసం ఉంటామని లేదంటే రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి అప్పగిస్తూ వారి నుంచి హామీ పొందాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు ఆమోదం తెలిపేలా అండర్ టేకింగ్ తీసుకోవాలని సూచించారు. నాలుగు జిల్లాల పరిధిలోగల కాలనీల్లో ముఖ్యంగా విద్యుత్, త్రాగునీరు, డ్రైనేజ్ వంటి కనీస వసతులను తప్పని సరిగా కల్పించాలని, ఈ విషయంలో జిహెచ్ ఎంసీ సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా 22వేల ఇళ్లకు విద్యుత్ మీటర్లను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం టవర్లు మొత్తం పూర్తయ్యేవరకూ ఆగకుండా పూర్తయిన వాటిని ఎప్పటికప్పుడు లబ్దిదారులకు కేటాయించాలన్నారు. అదేవిధంగా వివిధ కాలనీల్లో ఉన్న వాణిజ్య సముదాయాలను అ÷-దదె ప్రాతిపదకన గాకుండా వేలం పద్దతిలో వాటిని విక్రయించాలని ఆ విధంగా వచ్చిన డబ్బును అక్కడి సొసైటీ, ప్రభుత్వం పేరిట జాయింట్ అకౌంట్ పేరిట వేయాలన్నారు. అంతేగాక ప్రజా ప్రయోజన కార్యాలయాల కోసం కూడా కొన్నింటిని కేటాయించాలని తెలిపారు. ఈ విషయంలో సహకార శాఖ సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి, ఎండీ, వీపీ గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం

## ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి

**రైతులతో కలసి కలెక్టరేట్ వద్ద ధర్నా**

**జగిత్యాల, మార్చి 16:** అన్నదాతల సమస్యలను పట్టించుకోవడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కజొన్న పంట కొనుగోళ్లలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆగ్రహించారు. రైతుల పంటకు తగిన ధర దక్కకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మొక్కజొన్నను మద్దతు ధరకు వెంటనే కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాల పట్టణంలో రైతులు సోమవారం పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి జీవన్‌రెడ్డి నాయకత్వం వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మొక్కజొన్న రైతులు తమ సమస్యలను ప్రభుత్వానికి తెలపడానికి కలెక్టరేట్‌కు తరలివచ్చారు. రైతుల చేతుల్లో ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ తమ ఆందోళన వ్యక్తం చేశారు. ర్యాలీ అనంతరం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడారు. మొక్కజొన్న పంటకు



తగిన ధర ఇవ్వాలని, వెంటనే ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని జీవన్‌రెడ్డి ధ్వజమెత్తారు. రైతులు పంట పండించి మార్కెట్‌కు తీసుకువస్తే ప్రభుత్వం సరైన విధంగా కొనుగోళ్లు చేయడం లేదన్న ÷ర్ అయ్యారు. కొనుగోళ్లు ఆలస్యం కావడంతో రైతులు మధ్యవర్తుల చేతిలో నష్టపోతున్నారని పేర్కొన్నారు. మార్కెట్లో ధరలు తగ్గిపోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల నుంచి మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో మంచి వ్యవస్థ ఉండేదని జీవన్‌రెడ్డి ప్రస్తావించారు. మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి మొక్కజొన్నను కొనుగోలు చేసేవారని గుర్తుచేశారు. అలాగే గత పదేళ్లలో కూడా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు జరిగినట్లు తెలిపారు. అయితే కాంగ్రెస్ సర్కార్‌లో ప్రస్తుతం ఆ విధానం సరిగా అమలు కావట్లేదని విమర్శించారు. ప్రభుత్వం మళ్లీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు ప్రారంభిస్తే రైతులకు ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కజొన్న సాగు జరుగుతుందని జీవన్‌రెడ్డి తెలిపారు. అయితే ఈసారి పంటకు సరైన ధర లేకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. పంటను పండించడానికి రైతులు ఎరువులు, విత్తనాలు, నీటి ఖర్చుల కోసం అప్పులు చేసి సాగు చేస్తారని, కానీ మార్కెట్లో ధరలు తక్కువగా ఉండటంతో వారికి పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోళ్లు ఆలస్యం కావడంతో రైతులు తమ పంటను నిల్వ చేయలేక తక్కువ ధరకు అమ్మాల్సి వస్తోందని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం మద్దతు ధరకు పంటను కొనుగోలు చేయాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. పండించిన పంటకు కనీస ధర లభించకపోతే రైతన్నలు ఆర్థికంగా కుంగిపోతారని తెలిపారు. అన్నదాతల పంటను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతన్నల నుంచి నేరుగా మొక్కజొన్న కొనాలని ప్రభుత్వాన్ని జీవన్ రెడ్డి కోరారు–

# ప్రాణాలు తీసిన చేపల వేట

**మూసీలో మునిగి ముగ్గురు యువకులు మృతి**

**హైదరాబాద్, మార్చి 16:** చేపల వేటకు వెళ్లి.. ముగ్గురు యువకులు మృతి చెందిన సంఘటన గండిపేట జలాశయం దిగువున ఉన్న మూసి నది పరివాహక ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసులు, రెస్క్యూ టీం నదిలో గాలించి వారి మృతదేహాలను సోమవారం ఉదయం ఒడ్డుకు తీసుకువచ్చారు. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని ఇబ్రహీంబాగ్‌కు చెందిన కార్తీక్ (25), గోవర్ధన్ (23), వెంకటేష్ (25)లు ఆదివారం మూసి నది పరివాహక ప్రాంతంలో చేపల వేటకు వెళ్లారు. లోతు ఎక్కువగా ఉండడంతో.. వారు నదిలో మునిగిపోయారు. ఈ విషయాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. అలాగే రెస్క్యూ టీమ్‌ను సైతం అక్కడికి రప్పించారు. సాయంత్రం నుంచి వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ముగ్గురు ఒకే కాలనీ వాసులు కావడంతోపాటు స్నేహితులని మృతుల బంధువులు తెలిపారు. మృతుల కుటుంబాలు గాంధీ



ఆసుపత్రికి చేరుకుని కన్నీరుమున్నీరు అవుతున్నారు.



# ఆరు గ్యారెంటీలపై నిలదీస్తాం

**గన్‌పార్క్ వద్ద అమరులకు కేటీఆర్ తదితరుల నివాళి**

**హైదరాబాద్, మార్చి 16:** ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు ఠంచనుగా పడేదని గుర్తుచేశారు. అదే కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండిపోతున్నా రైతుబంధు దిక్కులేదని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. శాసనసభ సమావేశాలకు ముందు అమరవీరుల స్థూపానికి నివాళులర్పించామని తెలిపారు. అమరవీరుల స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ, వారి త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. రెండున్నరేళ్లవుతున్నా ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించలేదని విమర్శించారు. ఆనాడు గవర్నర్‌తో చట్టబద్ధత కల్పిస్తామని చెప్పించారని తెలిపారు. పంటల వేసే నాటికి కేసీఆర్ రైతుబంధు నిధులు వేసేవారని కేటీఆర్ గుర్తుచేశారు. రాహుల్ బంధు కాదు.. రైతుబంధు వేయాలని కోరారు. రైతులకు వెన్నుపోటు.. రాహుల్‌కు వెయ్యి కోట్లా అని నిలదీస్తామని అన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాల ఊసే లేదని.. రైతుబంధుకు దిక్కే లేదని విమర్శించారు. వృద్ధులు పింఛన్లు, రైతులు, రైతు కూలీలు రైతు భరోసా కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. జాబ్ క్యాలెండర్‌లో ఉత్త క్యాలెండర్ తప్ప జాబ్‌లు కనిపించడం లేదని అన్నారు. ఇలా అన్ని వర్గాలను కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని అన్నారు. ఆరు గ్యారంటీలకు రేవంత్ సర్కార్ మంగళం పడిందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలపై అసెంబ్లీలో నిలదీస్తామని స్పష్టం చేశారు.

# సీఎం రేవంత్ అసమర్థత

**నీటి వాటాలను కోల్పోతున్నాం: హరీష్ రావు**



**హైదరాబాద్, మార్చి 16:** తెలంగాణకు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ద్రోహాన్ని ప్రతిసారి ఎత్తిచూపుతున్నామని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గోదావరి, కృష్ణా జలాల హక్కుల్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని చెప్పారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం తెదేపా చేతిలో కీలుబొమ్మగా మారిందని ఆక్షేపించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీడబ్ల్యూసీ మీటింగ్‌కు వెళ్లటం లేదంటూనే.. ఏపీ డిమాండ్లకు సంతకం చేసి వస్తున్నారని విమర్శించారు. ఇటీవల జరిగిన సీడబ్ల్యూసీ మీటింగ్ అజెండా మొదటి అంశం... పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టు. అజెండాలో నల్లమల సాగర్ లేకపోతేనే మీటింగ్‌కు వస్తామని చెప్పి, తర్వాత వెళ్లిపోయి తెలంగాణను మోసం చేశారు. రాష్ట్రాల మధ్య గోదావరి జలాల పంపిణీయే జరగలేదని సీడబ్ల్యూసీ సమావేశంలో జీఆర్ఎంబీ చెప్పింది. జలాల పంపిణీ జరగలేదని జీఆర్ఎంబీ ఎలా చెబుతుంది? గోదావరిలో నీటి కేటాయింపులు జరగకపోతే.. ప్రాజెక్టులకు అనుమతి ఎలా ఇస్తున్నారని అన్నారు. గోదావరి బేసిన్‌లో వివిధ రాష్ట్రాలు చేపట్టిన 76 ప్రాజెక్టులకు అనుమతి ఎలా ఇచ్చారు? సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థత వల్ల తెలంగాణకు అన్యాయం జరుగుతోందని హరీశ్‌రావు విమర్శించారు.

# హామీలపై స్పష్టత ఏదీ

**ఉద్యోగుల బకాయిలపై ప్రస్తావన లేదే**

**గవర్నర్ ప్రసంగంపై బీజేపీ పెదవి విరుపు**



**హైదరాబాద్,మార్చి 16:** గవర్నర్ ప్రసంగంలో ప్రజలకు ఇచ్చిన హామీల గురించి ఎలాంటి ప్రస్తావన లేదని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. రైతుల ఇబ్బందులు, ఉద్యోగాల భర్తీ గురించి లేదని, ఉద్యోగుల సమస్యలపై ప్రస్తావించలేదని తెలిపారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తీవ్ర విమర్శలు చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... విశ్రాంత ఉద్యోగులు గోస పడుతున్నారని... ఎన్నేళ్లు అయినా వారికి బెనిఫిట్స్ అందడం లేదని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన చట్టాలు ఉన్నప్పటికీ వారికి అందాల్సిన సౌకర్యాలు అందడం లేదని ఎమ్మెల్యే విమర్శించారు. బీసీలను పూర్తిగా మోసం చేస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారు. సబ్ ప్లాన్ ముచ్చటే లేదన్నారు. ప్రభుత్వ అప్పులపై స్పష్టత లేదని తెలిపారు. గవర్నర్‌తో ప్రభుత్వం ఏదైనా మాట్లాడించేటప్పుడు ఆలోచించాలని.. అన్నీ అవాస్తవాలు, గందరగోళమైన మాటలు మాట్లాడించారని బీజేపీ ఎమ్మెల్యే ఆరోపించారు. ప్రభుత్వం విస్మరించినంత మాత్రాన తాము విడిచిపెట్టమని... తెలంగాణ ప్రజల గొంతుకగా బీజేపీ నిలబడి పనిచేస్తుందన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టం చేశారు. సెంబ్లీలో తెలంగాణ గేయం తర్వాత వందేమాతరం గేయాన్ని ఆలపించకుండా ఎంఐఎం ఎమ్మెల్యేలు బయటకు వెళ్లడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగాన్ని, దేశాన్ని అవమానించారని మండిపడ్డారు. ఎంఐఎం ఎమ్మెల్యేల తీరు సిగ్గుచేటన్నారు. వందేమాతరం వినడానికి ఆసక్తి లేకనా? లేక దేశభక్తి లేకపోవడమా అని ప్రశ్నించారు. వందేమాతరం గేయాన్ని అవమానపరిచిన ఎంఐఎం ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు.



## సంపాదకీయం

# మరికొన్నాళ్లు గ్యాస్ సంక్షోభం


దేశంలో గ్యాస్ కోసం ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు. కమర్షిల్ గ్యాస్ అస్సలు లభించడం లేదు. దీంతో హోట్ పరిశ్రమ కుదేలయ్యింది. దేశవ్యాప్తంగా హోటళ్లు మూతపడ్డాయి. కార్మికులు రోడ్డున పడ్డారు. తిరిగి క ట్టెల పొయ్యిలను ఆశ్రయిస్తున్నారు. తీవ్ర కాలుష్యంతో ఢిల్లీలో కట్టె పొయ్యిలను అనుమతించని ప్రభుత్వం తిరిగి అక్కడ కట్టెల పొయ్యిలకు అనుమతించింది. దీంతో గ్యాస్ సంక్షోభం ఎంత తీవ్రంగా ఉందో తెలుసుకోవచ్చు. దీనికి ఎవరిని నిందించి కూడా ప్రయోజనం లేదు. ఉన్న గ్యాస్‌ను సరఫరా చేస్తున్నారు. పానిక్ బుకింగ్స్ వల్ల చాలామందికి ఇబ్బంది ఎదురవుతోంది. అలాగే సిలిండర్లను బ్లాక్‌లో అమ్ముకుం టున్నారు. దీనికి ముందుగా చెక్ పెట్టాలి. గ్యాస్ సరఫరాలపై విజిలెన్స్ నిఘా పెట్టాలి. నల్లబజారుకు తరలకుండా చూడాలి. అలాగే హోటల్ పరిశ్రమను ఆదుకునే ప్రయత్నాలు ముమ్మరం చేయాలి. ఈ క్రమంలో రెండు ఇంధన నౌకలు హర్మ్యూజ్ జలసంధి దాటి భారత్ చేరుకున్నాయి. ఇది కొంత ఊరటనిచ్చే అంశం. పర్షియన్ గల్ఫ్ నుంచి బయటకు వెళ్లే ఏకైక సముద్ర మార్గమైన హోర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. జలసంధి నిండా వందలాది ట్యాంకర్లు నిలిచిపోయినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో బ్రెంట్ క్రూడ్ చమురు ధర యుద్ధానికి ముందు బ్యారెల్‌కు 65 అమెరికన్ డాలర్లుగా ఉండగా, ఇప్పుడది వంద డాలర్లకు పెరిగింది. ఇదే పరిస్థితులు కొనసాగితే రానున్న రోజుల్లో ధర మరింతగా పెరగడం ఖాయమన్న విశ్లేషణలు వస్తున్నాయి. ఇరాన్‌కు సమీపంలోని 33 కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ జలసంధి ద్వారానే ప్రపంచ చమురు, సహజ వాయువు సరఫరాలో దాదాపు ఐదవ వంతు సాగుతుంది. మన దేశం రోజుకు సగటున 40 లక్షల బ్యారెళ్ల చమురు దిగుమతి చేసుకుంటూ ఉండగా, అందులో 55 శాతం దీని ద్వారానే వస్తోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న దాడితో మన దేశానికి తీవ్రమైన ఇంధన సంక్షోభం తప్పదన్న భయాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటూ ఇరాన్ చేస్తున్న ప్రతీకార దాడులతో పశ్చిమ ఆసియా అంతా యుద్ధ మేఘాలు విస్తరిస్తున్నాయి. అమెరికా ఇరాన్‌పై చేసిన దాడి 16వ రోజుకు చేరుకుంది. ప్రతి బ్యారెల్ చమురు ధరలో ఒక డాలర్ పెరుగుదల చోటుచేసుకున్నా, భారత్‌పై సంవత్సరానికి 200 కోట్ల రూపాయల అదనపు దిగుమతి భారం పడుతుందని అంచనా! అధికారిక సమాచారం ప్రకారం 2024-25లో చమురు దిగుమతుల కోసం మన దేశం సుమారుగా 11.5 లక్షల కోట్ల రూపాయల (137 బిలియన్ డాలర్లు)ను ఖర్చు చేసింది. ఏకపక్షంగా యుద్ధానికి కాలుదువ్విన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 'ప్రస్తుతం నాలుగు నుండి ఐదు వారాలు' కొనసాగవచ్చని చెబుతున్నారు. ఇరాన్ ప్రతిఘటన తీరును గమనిస్తున్న పరిశీలకులు యుద్ధం అంతకన్నా ఎక్కువ రోజులే సాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనివార్యంగా పెరిగే దిగుమతి ఖర్చుల వల్ల విదేశీ లోటు పెరిగి వాణిజ్య సమతుల్యతను దెబ్బతీస్తుందని, రూపాయిపై ఒత్తిడి పెరుగుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు రూపాయి విలువ గణనీయంగా పడిపోయింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి దేశీయ ట్రేడ్ సూచికలు పతనోన్ముఖానే వున్నాయి. మరోవైపు మన దేశం వద్ద ఉన్న చమురు నిల్వలు మరో 40-45 రోజుల వినియోగానికి మాత్రమే సరిపోతాయంటూ వస్తున్న వార్తలు పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మనకు పొరుగునే ఉన్న చైనా వద్ద దాదాపు ఆరునెలలకు సరిపడే నిల్వలు ఉండటం అక్కడి పాలకుల ముందు చూపునకు నిదర్శనం. రష్యా నుండి దిగుమతులుతగ్గాయి. ఇప్పుడు ఇరాన్‌పై అమెరికా చేసిన దాడి, హోర్ముజ్ జలసంధి మూసివేతతో మన దేశ ఇంధన భద్రత ప్రశ్నార్థకంగా మారినప్పటికీ ఇరాన్ భారత్ పట్ల అనుకూలత ప్రదర్శించింది. 40 రోజులకు సరిపడే నిల్వలు ఉన్నాయని చెబుతున్నప్పటికీ యుద్ధ తీవ్రత కొనసాగితే పెట్రో ధరలు పెరగక తప్పవన్న ఆందోళన వినియోగదారుల్లో వ్యక్తమవుతోంది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగితే దాని ప్రభావంతో నిత్యావసర వస్తువులతో పాటు, అన్ని రకాల వినియోగ సరుకుల మీద ఉంటుందన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అదే జరిగితే, దేశ వ్యాప్తంగా సామాన్యుల కష్టాలు మరింత పెరగుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇంధన సంక్షోభాలను ఎదుర్కొనేందుకు చమురు సరఫరా వనరులను విస్తరించేందుకు కేంద్రం తక్షణం చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా హోటల్ పరిశ్రమలను ఆదుకోవాల్సి ఉంది. అయితే పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా దేశంలో వంటగ్యాస్‌కు డిమాండ్ అమాంతం పెరిగిందని కేంద్రప్రభుత్వం అంగీకరించింది. అయినప్పటికీ వంట గ్యాస్ పంపిణీలో ఇబ్బంది లేదని భరోసా ఇచ్చింది. దేశీయంగా వంట గ్యాస్ ఉత్పత్తి 30శాతం మేర పెంచినట్లు తెలిపింది. వాణిజ్య సిలిండర్ల కొరత ఉండడంతో హోటళ్లు, ఆహార పరిశ్రమ ఇబ్బందులు పడుతోందని అంగీకరించారు. అందువల్ల వాణిజ్య సిలిండర్ల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించామని చెప్పారు. ప్రాధాన్య క్రమంలో అవి పంపిణీ చేస్తాయని తెలిపారు. ఆస్పత్రులు, విద్యా సంస్థలకు వంట గ్యాస్‌ను అందజేస్తామని ప్రకటించారు. ఇక, ఇళ్లకు పైపుల ద్వారా సరఫరా అయ్యే పైప్డ్ న్యాచురల్ గ్యాస్ (పీఎన్‌జీ), వాహనాలకు వినియోగించే కంప్రెస్డ్ న్యాచురల్ గ్యాస్ (సీఎన్‌జీ)ల సరఫరాకు ఎలాంటి అంతరాయాలు లేవని తెలిపింది. పీఎన్‌జీ కనెక్షన్ ఉన్న వారికి గ్యాస్ సిలిండర్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తంగా ఈ సంక్షోభం ఇంకెంతకాలం అన్నది యుద్ధ తీవ్రతను బట్టి మాత్రమే మారుతుందన్నది నిజం.

# ఇరాన్ డ్రోన్ దాడులు తీవ్రం

**దుబాయ్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో దాడి**

**ఇంధన ట్యాంకర్ వద్ద చెలరేగిన మంటలు**

**టెహ్రాన్, ఫిబ్రవరి 16:** ఇరాన్ తో ఇజ్రాయెల్, అమెరికా యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్.. డ్రోన్ దాడుల ను తీవ్రతరం చేసింది. తన పొరుగుదేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా డ్రోన్‌లతో విరుచుకుపడుతోంది. సోమవారం తెల్లవారుజామున దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో డ్రోన్ దాడులు చేసింది. ఈ సందర్భంగా ఒక డ్రోన్ ఇంధన ట్యాంక్‌ను ఢీకొట్టడంతో భారీగా మంటలు చెలరేగాయి. దాంతో విమానాశ్రయంలోని అన్ని విమానాలను తాత్కాలికంగా నిలిపివేశారు. విమానాశ్రయాన్ని మూసివేసినట్లు దుబాయ్ సివిల్ ఏవియేషన్ అథారిటీ అధికారులు ప్రకటించారు. ప్రయాణికులు, ఎయిర్‌పోర్టు సిబ్బందికి సేఫ్టీ నోటీస్ జారీచేశారు. విమానాల స్టేటస్ తెలుసుకునేందుకు విమానయాన సంస్థలను సంప్రదించాలని ప్రయాణికులకు సూచనచేశారు. అంతేగాక పలు విమానాలను అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించినట్లు ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు. ఇంధన ట్యాంక్‌కు అంటుకున్న మంటలను ఆర్పేందుకు దుబాయ్ సివిల్ డిఫెన్స్ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. సమీపంలోని ప్రజలు ఇళ్లల్లోనే ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇంధన ట్యాంక్‌పై దాడి నేపథ్యంలో ఈ ప్రాంతంలోని కీలకమైన ఇతర మౌలిక సదుపాయాల వద్ద భద్రత పెంచినట్లు అధికారులు పేర్కొన్నారు.



# ముంద్రా పోర్టుకు చేరుకున్న శివాలిక్

- ఖతార్ నుంచి గ్యాస్‌తో వచ్చిన నౌక
- భారత్‌కు దక్కనున్న భారీ ఊరట




**ముంద్రా, ఫిబ్రవరి 16:** మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ భారత్‌కు ఊరటనిచ్చే వార్త అందింది. ఖతార్ నుండి లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్‌తో బయలుదేరిన భారీ ట్యాంకర్ 'శివాలిక్', సురక్షితంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకుంది. హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయిలో ఉన్న సమయంలో ఈ నౌక రాక ప్రాధాన్యత సంతరించుకుంది. ఇరాన్, అమెరికా మధ్య ఘర్షణల కారణంగా ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి మూసివేత ముప్పు పొంచి ఉంది. ఇరాన్ ఈ మార్గాన్ని అడ్డుకుంటామని హెచ్చరించిన నేపథ్యంలో, గల్ఫ్ దేశాల నుండి భారత్‌కు చమురు, గ్యాస్ సరఫరా నిలిచిపోతుందేమోనన్న ఆందోళన నెలకొంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో 'శివాలిక్' నౌక సురక్షితంగా ప్రయాణించి లక్ష్యాన్ని చేరుకోవడం భారత ఇంధన భద్రతకు సానుకూల సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు. శివాలిక్ ఎల్‌పిజి ట్యాంకర్ ఖతార్‌లోని రాస్ లఫ్ఫాన్ నుండి వేల టన్నుల ఎల్‌పీజీని మోసుకొచ్చింది. ఉద్రిక్తతల దృష్ట్యా భారత నావికాదళం గల్ఫ్ ప్రాంతంలో నిఘాను పెంచిన సంగతి తెలిసిందే. భారతీయ నౌకల ప్రయాణాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ భద్రతాపరమైన భరోసా కల్పిస్తోంది. గుజరాత్‌లోని అదానీ ముంద్రా పోర్టులో ఈ గ్యాస్ అన్-లోడింగ్ పక్రియ ప్రారంభమైంది. ఇది దేశీయ గ్యాస్ అవసరాలకు ఎంతో కీలకం. ప్రపంచవ్యాప్తంగా రవాణా అయ్యే చమురులో సుమారు 20 శాతం ఈ జలసంధి ద్వారానే సాగుతుంది. ఇరాన్-అమెరికా యుద్ధం వల్ల ఈ మార్గం మూసుకుపోతే అంతర్జాతీయంగా చమురు ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలు అంతర్జాతీయ షిప్పింగ్ కంపెనీలు ఈ మార్గంలో ప్రయాణాన్ని నిలిపివేయగా, భారత్ మాత్రం తన వ్యూహాత్మక సంబంధాల ద్వారా సరఫరాను కొనసాగిస్తోంది.

# హర్మ్యూజ్ జలసంధి వద్దకు యుద్ధనౌకలు

- ట్రంప్ అభ్యర్థనను తిరస్కరించిన ఆస్ట్రేలియా
- సంయమనం పాటించాలన్న జపాన్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు యుద్ధ నౌకలను పంపాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన అభ్యర్థనను మిత్ర దేశాలు తిరస్కరించాయి. ప్రస్తుతానికి తమకు ఆ ఆలోచన లేదని తేల్చి చెప్పాయి. ట్రంప్ అభ్యర్థనను ఆస్ట్రేలియా తోసి పుచ్చింది. తాము యుద్ధ నౌకలను పంపబోమని స్పష్టం చేసింది. 'ఆ జలసంధి ఎంత కీలకమో మాకు తెలుసు. కానీ అక్కడకు మేము యుద్ధ నౌకలను పంపబోము. అసలు యుద్ధ నౌకల కోసం మమ్మల్ని ఎవరూ సంప్రదించలేదు. మేము ఈ విషయంలో జోక్యం చేసుకోలేదు' అని ఆస్ట్రేలియా కేబినెట్ మంత్రి కేథరిన్ కింగ్ చెప్పారు. ట్రంప్ అభ్యర్థనపై జపాన్ ఆచితూచి స్పందించింది. ఈ విషయంలో సంయమనం అవసరమని పేర్కొంది. ప్రస్తుత పరిస్థితుల్లో తాము మేరిటైమ్ చర్యల



గురించి ఆలోచించట్లేదని పేర్కొంది. ఇతర ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించినట్టు తెలిపింది. అమెరికాతో మరిన్ని చర్చల తరువాత ఈ విషయంలో ఒక నిర్ణయానికి వస్తామని దక్షిణ కొరియా పేర్కొంది. సమగ్ర సమీక్ష తరువాత ఈ విషయంలో ముందడుగు వేస్తామని వెల్లడించింది. బ్రిటన్ కూడా ఈ విషయమై ఆచితూచి స్పందించింది. యుద్ధ నౌకలను పంపించే విషయంలో ట్రంప్‌తో చర్చిస్తున్నామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీతో కూడా చర్చించినట్టు తెలిపారు. సోమవారం జరగనున్న సమావేశంలో మరోసారి ఈ విషయమై చర్చిస్తామని అన్నారు.హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు యుద్ధ నౌకలను పంపించాలని పలు దేశాలను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం అభ్యర్థించిన విషయం తెలిసిందే. తమ పరిధిలోని ప్రాంతాన్ని ఆయా దేశాలు రక్షించుకోవాలని అన్నారు. ఇంధన అవసరాల కోసం హోర్ముజ్ జలసంధిపై అమెరికా అంతగా ఆధారపడలేదని అన్నారు. ఇతర దేశాలకే ఆ అవసరం ఎక్కువని కామెంట్ చేశారు. ఈ సందర్భంగా చైనా గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. చైనా దిగుమతుల్లో అధిక శాతం హోర్ముజ్ మీదుగానే వెళుతున్నాయని అన్నారు. అయితే, హోర్ముజ్ జలసంధిని తెరిపించే ప్రయత్నాల్లో చైనా భాగం అవుతుందా? లేదా? అనే విషయంపై ఆయన స్పందించేందుకు నిరాకరించారు.

# గల్ఫ్ యుద్ధం వేళ చైనా దూకుడు

**తైవాన్ దిశగా యుద్ధనౌకలు, విమానాల మొహరింపు**

**తైపీ, ఫిబ్రవరి 16:** గల్ఫ్ యుద్ధంతో అంతా అటువైపు దృష్టి పెట్టగా చైనా మరోమారు తైవాన్‌పై దృష్టి సారించింది. గత రెండు వారాలుగా కొంత నిశ్శబ్దంగా ఉన్న చైనా సైన్యం.. మళ్ళీ తైవాన్ సరిహద్దుల్లో తన ప్రాబల్యాన్ని చాటుకోవడం మొదలుపెట్టింది. తైవాన్ రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, గత 24 గంటల్లో భారీ సంఖ్యలో , నౌకలు చైనా యుద్ధ విమానాలు తైవాన్ గగనతలంలోకి ప్రవేశించాయి. కాగా, ఫిబ్రవరి 27 నుండి మార్చి 13 వరకు తైవాన్ సరిహద్దుల్లోకి చైనా యుద్ధ విమానాల రాక గణనీయంగా తగ్గింది. సాధారణంగా ప్రతిరోజూ పదుల సంఖ్యలో విమానాలను పంపే చైనా, ఈ 16 రోజుల కాలంలో కేవలం 7 విమానాలను మాత్రమే పంపింది. అయితే, ఈ ఆకస్మిక విరామానికి కారణమేంటో రక్షణ నిపుణులకు సైతం అంతుచిక్కలేదు. కానీ, ఆదివారంనుండి చైనా మళ్ళీ తన దూకుడును పెంచింది. తైవాన్ చుట్టూ సుమారు 26 చైనా సైనిక విమానాలను గుర్తించారు. వీటిలో 16 విమానాలు తైవాన్ నైరుతి ఎయిర్ డిఫెన్స్ ఐడెంటిఫికేషన్ జోన్ లోకి ప్రవేశించాయి. విమానాలతో పాటు 7 చైనా యుద్ధ నౌకలు కూడా తైవాన్ సముద్ర తీరానికి సమీపంలో చక్కర్లు కొడుతున్నాయి. ఫిబ్రవరి 25న 30 విమానాలు వచ్చిన తర్వాత, మళ్ళీ ఈ స్థాయి-ంలో విమానాలు రావడం ఇదే తొలిసారి. ఇలాఉండగా, మార్చి 31న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాలో పర్యటించనున్నారు. ఇక, చైనా విమానాలు లేని సమయంలో కూడా వారి యుద్ధ నౌకలు సముద్రంలోనే ఉన్నాయని తైవాన్ రక్షణ మంత్రి వెల్లింగ్టన్ కూ స్పష్టం చేశారు. చైనా నుండి ముప్పు ఏమాత్రం తగ్గలేదని.. తాము నిరంతరం అప్రమత్తంగానే ఉన్నామని ఆయన పేర్కొన్నారు.

# దుబాయ్ విమానాల రద్దు

**ఢిల్లీ:** సోమవారం తెల్లవారుజామున దుబాయ్ ఎయిర్ పోర్టు సమీపంలో ఇంధన ట్యాంక్‌పై డ్రోన్ దాడి జరిగింది. విమానాశ్రయ పరిసర ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దీంతో ఎయిర్ పోర్టును మూసివేస్తున్నట్లు దుబాయ్ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఎయిరిండియా కీలక నిర్ణయం తీసుకుంది. దుబాయ్ వెళ్లే విమానాలన్నింటినీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అయి-ంతే, అబుదాబి, రస్ అల్‌ఖైమా, షార్జాలకు విమానాలు యథావిధిగా కొనసాగుతాయని ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది. మరోవైపు తిరువనంతపురం నుంచి దుబాయ్ వెళ్తున్న ఎమిరేట్స్ విమానం కూడా ఆగింది. టీఆర్వీ--డీఎక్స్‌బీవిమానం353 మంది ప్రయాణికులు, 19 మంది సిబ్బందితో ఇవాళ ఉదయం 4:40 గంటలకు బయలుదేరి.. దుబాయ్ ఎయిర్ పోర్టు మూసివేయడంతో ఉదయం 8:40 గంటలకు తిరిగి వచ్చింది. అలానే కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరిన మరో ఎమిరేట్స్ విమానం ఈకే533 కూడా వెనక్కి వచ్చేసింది.

# అన్ని రాష్ట్రాల్లోనూ గ్యాస్ నిల్వలు ఉన్నాయి

**వంట గ్యాస్ సరఫరాపై కేంద్రం కీలక ప్రకటన**

**న్యూఢిల్లీ, మార్చి 16:** వంట గ్యాస్ సరఫరాపై కేంద్రం కీలక ప్రకటన చేసింది. గృహ వినియోగదారులకు వంద శాతం ఎల్పీజీ సరఫరా చేస్తామని కేంద్రం స్పష్టం చేసింది. అన్ని రాష్ట్రాల్లో ఎల్పీజీ స్టాక్ ఉందని తెలిపింది. హర్మ్యూజ్ దగ్గర భారత నౌకలన్నీ క్షేమంగానే ఉన్నాయని, శివాలిక్ నౌకలో 48 వేల మెట్రిక్ టన్నుల గ్యాస్ ఉందని కేంద్రం వెల్లడించింది. కాగా, ఖతార్ నుండి లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్‌తో బయలుదేరిన 'శివాలిక్' నౌక సురక్షితంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకుంది. హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయిలో ఉన్న సమయంలో ఈ నౌక రాక ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్రం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను పూర్తిగా నిలిపి వేసింది. దీంతో దేశ వ్యాప్తంగా ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు మెల్లమెల్లగా మూతపడుతున్నాయి. హాస్టల్స్ మెనూను పూర్తిగా మార్చేశాయి. కేవలం ఒక కర్రీతో సరిపెడుతున్నాయి. గ్యాస్ కొరత కారణంగా పలు దేవాలయాలు తాత్కాళికంగా ప్రసాదం తయారీని నిలిపివేశాయి. సీఎన్జీ బంకుల్లోనూ గ్యాస్ నిల్వలు అడుగంటుతున్నాయి. దీని కారణంగా గ్యాస్‌తో నడిచే వందలాది ఆటోలు నిలిచిపోతున్నాయి. డొమస్టిక్ గ్యాస్ సిలిండర్ల వినియోగదారులకు కూడా కష్టాలు తప్పటం లేదు. బుకింగ్, డెలివరీ విషయంలో నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గ్యాస్ సిలిండర్ కోసం వినియోగదారులు గంటల తరబడి క్యూలో వేచి ఉంటున్నారు. యుద్ధ



పరిస్థితులకు తోడు.. పండుగ సమయం కావటంతో గ్యాస్ సిలిండర్లకు ఎక్కువ డిమాండ్ ఏర్పడింది. మండుటెండను సైతం లెక్క చేయకుండా జనం గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడి సిలిండర్ తీసుకుంటున్నారు.



# ఒక మనిషి త్యాగం.. ఒక జాతి గౌరవం

## నివాళి అర్పించిన మంత్రి లోకేశ్

**అమరావతి, మార్చి 16(సమయం న్యూస్):** అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా అమరావతి లోని శాఖమూరులో 58 అడుగుల ఎత్తైన భారీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొని ప్రసంగించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను 'ఉస్తాద్ భగత్ సింగ్' అని మంత్రి సంబోధించారు. 'ఒక మనిషి త్యాగం ఒక జాతి గౌరవం. ఒక మనిషి మరణం ఒక రాష్ట్రం' అని అమరజీవి త్యాగాన్ని స్మరించుకున్నారు. 'అమరజీవి... చిరంజీవి' అని పేర్కొన్నారు. ఈ విగ్రహానికి 'ఏపీ ఆత్మగౌరవం స్టాట్యూ ఆఫ్ సాక్రి÷ల్గ÷స్' అనే పేరు పెట్టాలని కోరినట్లు లోకేశ్ తెలిపారు. యువగళం పాదయాత్రలో ఆర్యవైశ్య సోదరులను కలసి హామీ ఇచ్చానని.. 'అమరావతిలోనే పొట్టి శ్రీరాములు విగ్రహం పెడతామని చెప్పి.. చేసి చూపించాం' అని మంత్రి గుర్తుచేశారు. ఒక రోజు ఉపవాసం చేయాలంటే ఇబ్బంది పడతామని... కానీ తెలుగు ప్రజల కోసం, జాతి కోసం పొట్టి శ్రీరాములు దీక్ష చేశారన్నారు. ఈ చరిత్రను భావితరాలు గుర్తుపెట్టుకునే విధంగా ఇక్కడ విగ్రహం ఏర్పాటు చేశామని వెల్లడించారు. అనుకున్న సమయానికి విగ్రహం సిద్ధం చేశామని మంత్రి తెలిపారు. ఆర్యవైశ్య సోదరులను ఆదర్శంగా తీసుకోవాలని సీఎం క్యాబినెట్‌లో చెప్పానని లోకేశ్ పేర్కొన్నారు. దళితులకు ఆలయ ప్రవేశం కోసం అమరజీవి కృషి చేశారని తెలిపారు. ఆయన స్ఫూర్తితోనే యువగళం పాదయాత్ర చేశానని చెప్పుకొచ్చారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం మొదటి అడుగు ఆయనే వేశారన్నారు. పొట్టి శ్రీరాములు పేరుతో ఒక కాయిన్ రిలీజ్ చేయాలని కోరానని.. కేంద్రంతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

# శ్రీశైలంలో ఉగాది ఉత్సవాలు

## యాగప్రవేశంతో ప్రారంభం



**నంద్యాల, మార్చి 16 (సమయం న్యూస్):** ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం ఆలయ యాగశాలలో అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగశాల ప్రవేశంతో ఉగాది మహోత్సవాలకు ఆలయ ఈవో శ్రీనివాసరావు శ్రీకారం చుట్టారు. నేటి సాయంత్రం స్వామి, అమ్మవారికి భృంగి వాహన సేవ ఘనంగా నిర్వహించనున్నారు. తర్వాత పురవీధుల్లో శ్రీస్వామి అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఉగాది మహోత్సవాల సందర్భంగా ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తుల రద్దీ కారణంగా నేటి నుంచి ఈ నెల 20 వరకు భక్తులందరికీ శ్రీస్వామివారి అలంకార దర్శనానికి మాత్రమే అనుమతి ఇవ్వనున్నారు. స్పర్శ దర్శనం, సాధారణ దర్శనంపై పరిమితులు విధించారు. ఆలయ క్యూలైన్లు కన్నడ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. నల్లమల అడవి మార్గాల ద్వారా పాదయాత్రగా వచ్చిన లక్షలాది కన్నడ భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. స్వామి అమ్మవార్ల దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పడుతోంది. ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో 16 నుంచి 20 వరకు ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# నెల్లూరు వైసిపి నేత కామిరెడ్డి అరెస్ట్



**నెల్లూరు, మార్చి 16 (సమయం న్యూస్):** నెల్లూరు జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, చిల్లకూరుకు చెందిన కీలక నేత కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. సత్యనారాయణ రెడ్డి ప్రయాణ సమాచారం అందుకున్న పోలీసులు, ఆయనను రేణిగుంట విమానాశ్రయం వద్ద అదుపులోకి తీసుకున్నారు. కలవకూరు సమీపంలోని స్వర్ణముఖి నది వద్ద గతంలో జరిగిన ఒక దాడి ఘటనకు సంబంధించి నమోదైన కేసులో ఈ అరెస్ట్ జరిగినట్లు తెలుస్తోంది. కనది పరివాహక ప్రాంతంలో జరిగిన ఘర్షణలు, భౌతిక దాడులకు సంబంధించి నమోదైన కేసులో సత్యనారాయణ రెడ్డి ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇదే కేసులో పెళ్లకూరు మండల ఎంపీపీ శేఖర్ రెడ్డిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నెల్లూరు జిల్లాలో బలమైన పట్టున్న కామిరెడ్డి అరెస్ట్ తో స్థానిక వైసీపీ శ్రేణుల్లో ఆందోళన మొదలైంది.

# పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ ఓ చరిత్ర

మొదటి పేజీ తరువాయి




నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, టీజీ భరత్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి చేసిన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు గుర్తుగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తుళ్లూరు సమీపంలో 6.8 ఎకరాల్లో నిర్మిస్తున్న స్మృతివనంలో అమరజీవి 125వ జయంతి వేడుకలను భారీస్థాయిలో నిర్వహించడానికి ఆర్యవైశ్య సంఘాలు, ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. పొట్టి శ్రీరాములు అందరివాడని భావించి.. ప్రతి ఒక్కరూ ఈ విగ్రహావిష్కరణ కోసం కృషి చేశారన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతి పూర్తయితే ఈ విగ్రహం మరింత అద్భుతంగా కనిపిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. స్ఫూర్తికి మారు పేరు ఆర్యవైశ్య సంఘమని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో పొట్టి శ్రీరాములు పనిచేశారని తెలిపారు. అలాగే అనేక సామాజిక ఉద్యమాల్లో ఆయన భాగస్వాములయ్యారని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసి రాష్ట్రాన్ని సాధించి పెట్టారని చెప్పారు. ఇక రాజధాని అమరావతి నిర్మాణంలో ఎంతోమంది రైతుల త్యాగం ఉందన్నారు. రాజధాని నిర్మాణానికి 29 వేల మంది రైతులు.. 33 వేల ఎకరాల భూమి ఇచ్చారని గుర్తు చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారీ ల్యాండ్ పూలింగ్‌కు సహకరించారని వివరించారు. రాజధాని లేని రాష్ట్రంలో వైసీపీ.. మూడు ముక్కలాట ఆడిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిని గత పాలకులు స్మశానం అని అవహేళన చేశారని తెలిపారు. పొట్టి శ్రీరాములు 58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల ఆయన భారీ విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. 6 నెలల్లో మొదటి దశ పనులు పూర్తి చేశారని వివరించారు. రెండో దశ పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ విగ్రహం కోసం 26 టన్నుల కాంస్యం, 42 టన్నుల ఐరన్ వినియోగించారని సీఎం చంద్రబాబు చెప్పారు. గత ప్రభుత్వం పాలనతో బ్రాండ్ దెబ్బతిన్నదని.. తెలుగు జాతి ఇబ్బంది పడిందని గుర్తించి తాను, పవన్ కళ్యాణ్ ఇద్దరం కలసి నిలబడి.. బీజేపీతో కలిసి కూటమిగా జత కట్టామని వివరించారు. గత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసిందన్నారు. 2027 గోదావరి పుష్కరాలకంటే ముందు పోలవరాన్ని జాతికి అంకితం చేస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. అమరావతిని మూడు ఏళ్లలో ఒక స్థాయికి తీసుకు వస్తామని స్పష్టం చేశారు. అమరావతిలో ఖర్చు ప్రభుత్వం డబ్బు కాదని.. ఇది ల్యాండ్ మానిటైజేషన్ ప్రాజెక్ట్ అని ఏపీ సీఎం వివరించారు. అమరావతి వల్ల సంక్షేమం సక్రమంగా జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మొన్నటి వరకూ ఆర్య వైశ్యులు వ్యాపారాలు చేసుకోవాలన్నా భయపడుతూ చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. రూ. 10 సంపాదిస్తే అందులో రూ.2 దానం చేసేది ఆర్య వైశ్య కులమని తెలిపారు. ఆర్య వైశ్యులను అనేక విధాలుగా పిలుస్తారని.. అందరిని అదే పేరుతో పిలిచేలా త్వరలోనే జీవో జారీ చేస్తామని ప్రకటించారు. పొట్టి శ్రీరాములుకు నిజమైన నివాళి ఇవ్వడమంటే.. ఏపీని నెంబర్ వన్‌గా నిలపడమేనని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# తెలుగు జాతి కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు




## • నివాళి అర్పించిన డిప్యూటీ సీఎం పవన్

**అమరావతి, మార్చి 16 (సమయం న్యూస్):** తెలుగు జాతి కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. మద్రాస్ ప్రెసిడెన్సిలో తెలుగు ప్రజల ఇబ్బందులను ఆయన గుర్తించి.. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళిగా 58 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆయన 125వ జయంతి సందర్భంగా అమరావతిలోని శాఖమూరులో ఈ విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ సహా పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం నాయకులు అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. పొట్టి శ్రీరాములు మన గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహానుభావుడని అన్నారు. స్వాతంత్ర్య సమర కాలంలో మహాత్మా గాంధీ 'నా వెంట 11 మంది ఉంటే దేశానికి స్వాతంత్ర్యం తీసుకురాగలను' అన్న మాటలను గుర్తుచేశారు. అలాంటి మహనీయుల త్యాగాల వల్లే మనకు స్వేచ్ఛ లభించిందని ఆయన తెలిపారు. తాను పొట్టి శ్రీరాములు గారిని ప్రత్యక్షంగా కలిసే అవకాశం పొందలేదని, అయితే వారి కుటుంబ సభ్యులను చూడటం ద్వారా వారి త్యాగాలను గుర్తు చేసుకునే అవకాశం లభించిందని పవన్ కళ్యాణ్ అన్నారు. అమరావతి నడిబొడ్డున పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక

# దడపుట్టిస్తున్న పెద్దపులి సంచారం

## 17 రోజులుగా శ్రమిస్తున్న అటవీ అధికారులు

**కాకినాడ, మార్చి 16 (సమయం న్యూస్):** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో 17 రోజులుగా పెద్దపులి సంచారం అక్కడి ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. పులిని పట్టుకునేందుకు అటవీశాఖ ప్రత్యేక బృందాల ప్రయత్నాలు కొనసాగుతున్నా ఇప్పటివరకు ఫలితం లేదు. ఆదివారం రాత్రి శంఖవరం మండలం మండపం వద్ద పోలం బూరయ్య అనే రైతు గేదె దూడపై పులి దాడి చేసింది. ప్రస్తుతం శంఖవరం మండలం, జి.కొత్తపల్లి సమీపంలో పెద్దపులి, ప్రత్తిపాడు లేదా రౌతులపూడి మండలాల వైపు పులి ప్రయాణించే అవకాశముందని, మూడు మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ హెచ్చరికలు జారీ చేసింది. కాకినాడ జిల్లాలోని ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. గత 16 రోజులుగా పలు గ్రామాల్లో సంచరిస్తూ ప్రజల్లో భయందోళనలు సృష్టిస్తున్న ఈ పులి ప్రస్తుతం శంఖవరం మండలంలోని ఉరకొండ పరిసరాల్లో కనిపించినట్లు సమాచారం. అటవీశాఖ అధికారులు పులిని పట్టుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ ఇప్పటి వరకు అవి ఫలించలేదు. ఈ పరిస్థితి అధికారులకు పెను సవాల్‌గా మారింది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అటవీశాఖ, రెవెన్యూ, పోలీస్ శాఖలు సంయుక్తంగా పర్యవేక్షణ చేపట్టి పరిస్థితిని సమీక్షిస్తున్నాయి. 16 రోజులుగా ఈ పెద్దపులి పలు గ్రామాల్లో సంచరిస్తోంది. మొదట అడవులకు సమీపంలోని గ్రామాల్లో కనిపించిన పులి, క్రమంగా మానవ నివాసాల దగ్గరకు రావడం ప్రజల్లో భయాందోళనలకు కారణమైంది. గ్రామస్థులు



రాత్రి సమయంలో బయటకు వెళ్లడానికి కూడా భయపడుతున్నారు. కొంతమంది రైతులు తమ వ్యవసాయ పనులను వాయిదా వేసుకున్నారు. పశువులను బయట మేపేందుకు కూడా భయపడుతున్న పరిస్థితి ఏర్పడింది. అటవీశాఖ అధికారులు మొదటి రోజు నుంచే పులిని గుర్తించేందుకు, దాని కదలికలను గుర్తించేందుకు ప్రయత్నాలు చేశారు. పులి అడుగుల ముద్రలు, కెమెరా ట్రాప్‌లు, స్థానికుల సమాచారం ఆధారంగా దాని సంచారాన్ని గమనిస్తున్నారు. అయినప్పటికీ పులి అధికారుల నుంచి తప్పించుకుంటోంది. ప్రస్తుతం ఈ పులి శంఖవరం మండలంలోని ఉరకొండ ప్రాంతంలో తిరుగుతున్నట్లు సమాచారం. ఇది అడవులతో కూడిన కొండ ప్రాంతం కావడంతో పులికి దాక్కునేందుకు అనుకూలంగా ఉంది. అదే సమయంలో ఈ ప్రాంతానికి సమీపంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు ఉండటం అధికారులను మరింత అప్రమత్తం చేసింది. ఉరకొండ సమీపంలో తహసీల్దార్, ఎంపీడీవో, ఆర్టీవో, ఐసీడీఎస్, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, విద్యుత్ శాఖ కార్యాలయాల వంటి ప్రభుత్వ విభాగాలు ఉన్నాయి. అదేవిధంగా ఎస్సీ బాలుర హాస్టల్, కస్తూర్బా పాఠశాల, కళాశాలలు కూడా ఈ ప్రాంతంలో ఉన్నాయి. అందువల్ల విద్యార్థులు, ఉద్యోగుల భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. పులిని సురక్షితంగా పట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ట్రాంక్విలైజర్ గన్స్‌తో కూడిన సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. పులి తరచూ సంచరిస్తున్న ప్రాంతాల్లో కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేశారు. పులి అడుగుల జాడలను పరిశీలిస్తూ దాని కదలికలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాగే పులిని పట్టుకునేందుకు బోన్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. అయితే పులి చాకచక్యంగా ఉండటంతో ఇప్పటి వరకు ఆ ప్రయత్నాలు ఫలించలేదు. కొన్నిసార్లు పులి కనిపించినట్లు సమాచారం వచ్చిన వెంటనే అధికారులు అక్కడికి చేరుకునే సరికి అది మరో ప్రాంతానికి వెళ్లిపోతుంది. ప్రస్తుతం పులి ఉన్న ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు, అది రౌతులపూడి మండలంలోకి వెళ్లే అవకాశం ఉందా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. ఉరకొండ నుంచి ఆ ప్రాంతానికి వెళ్లే అడవి మార్గాలు ఉన్నందున అటువైపు కూడా దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో రౌతులపూడి మండలంలోని గ్రామాల్లో కూడా అప్రమత్తత చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగం సూచించింది. గ్రామాల్లో మైకుల్లో ప్రకటనలు చేయిస్తూ ప్రజలను జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

# హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణంలో కీలక ఘట్టం

## స్టీల్ డయాగ్రిడ్ పనులను ప్రారంభించిన మంత్రి నారాయణ

**అమరావతి, మార్చి 16 (సమయం న్యూస్):** రైతులకు ఇచ్చిన మాట ప్రకారమే రాజధాని అమరావతిని నిర్మిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ స్పష్టం చేశారు. సోమవారం రాజధాని అమరావతిలో హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణంలో కీలక ఘట్టం చోటు చేసుకుంది. టవర్ -1కు మొదటి స్టీల్ డయాగ్రిడ్‌ను అమర్చే పనులను మంత్రి నారాయణ ప్రారంభించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ.. అమరావతిలో జీఏడీ, హెచ్‌ఓడీలకు మెత్తం 5 టవర్లు డయాగ్రిడ్ టెక్నాలజీతో నిర్మిస్తున్నామని తెలిపారు. జీఏడీ టవర్ మొత్తం 47 అంతస్తులతో మిగిలిన టవర్లు 40 అంతస్తులతో నిర్మిస్తున్నట్లు ఆయన వివరించారు. మొత్తం 53 లక్షల చదరపు అడుగు బిల్ట్ ఏరియాతో ఈ ఐదు టవర్ల నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. అధికార యంత్రాంగం మొత్తం ఒకేచోట ఉండేలా ఈ టవర్ల నిర్మాణం ఎ÷-లాన్ చేశామన్నారు. ప్రజలకు ఏ అవసరం ఉన్నా ఒకే చోట అన్ని కార్యాలయాలు ఉండేలా డిజైన్ చేసినట్లు పేర్కొన్నారు. 2028 అక్టోబర్ నాటికి అన్ని టవర్ల నిర్మాణం పూర్తి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి నారాయణ ప్రకటించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్ల నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చిందని తెలిపారు. ట్రంక్ రోడ్లు, లేఅవుట్ రోడ్లతోపాటు ప్రైవేట్ సంస్థల నిర్మాణాలు సైతం ప్రారంభమయ్యాయన్నారు. రాజధాని అమరావతిలో డయాగ్రిడ్ విధానంలో ఐదు ఐకానిక్ భవనాలను ప్రభుత్వం నిర్మిస్తున్న సంగతి తెలిసిందే.

## ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభం - భీమ్ భరత్ గారు



**చేవెళ్ల, మార్చి 16:(సమయం న్యూస్) :** షాబాద్ మండల పరిధిలో నారేడ్లగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని చేవెళ్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమ్ భరత్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాడైనా ఏనాడైనా పేదల పక్షాన ఉంటుందని, పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని మేనిఫెస్టో లో ఇచ్చిన మాట ప్రకారం ఇళ్లను మంజూరు చేస్తూ పేదల పక్షాన దేవునిలా నిలబడి పేదల కోసం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పామేనా నర్సింలు , మంగలి చెన్నయ్య , షాబాద్ మాజీ సర్పంచ్ తమలి రవీందర్ , నారేడ్లగూడ సర్పంచ్ రవి , రాజు , ప్రసాద్ , ఏక్కంబర్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు వేతనాలు వెంటనే పెంచాలి

- సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య



**సమయం న్యూస్ గజ్వేల్ మార్చి 16 :** పెరుగుతున్న ఖర్చులు గృహ అవసరాల కనుగుణంగా కనీస వేతనం 26 వేల రూపాయలు పెంచి అమలు చేయాలని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ గార్లకు వేతనాలు పెంచాలని వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా వేతనాలు పెరగడం లేదని, ఈ కాలంలో అనేక రెట్ల నిత్యవసర సరుకులు ధరలు, రోజువారీ ఖర్చులు పెరిగాయని ప్రస్తుతం వస్తున్న జీతాలతో కుటుంబాలు గడవడం లేదని, అప్పులు చేసే జీవనం కొనసాగించాల్సి వస్తుందని అన్నారు. సంవత్సరాల తరబడి కాంట్రాక్టు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్, రోజువారి కార్మికులుగా పనిచేయడం జరుగుతుంది అని కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సుమారు 40 మంది కార్మికులకు గత ఐదు నెలల జీతాలు అందలేదని, మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న ముంపు గ్రామాల కార్మికులకు మున్సిపల్ జీవో అమలు జరిపి వేతనాలు పెంచాలని కోరారు. కార్మికులందరికీ ఈ ఎస్ ఐ, పి ఎఫ్ చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు మరియు మున్సిపల్ యూనియన్ నాయకులు సంగపురం యాదగిరి, బచ్చలి కుమార్, నర్సింలు స్వామి సంతోష్ కుమార్ బాలయ్య మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

## అక్రమ అరెస్టులకు ఖండన

- ప్రభుత్వం నిర్బంధాన్ని ఆపాలి
- సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య




**సమయం న్యూస్ గజ్వేల్ మార్చి 16 :** రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి టీచర్లకు ఆయలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని, వేతనాలను పెంచాలని, పని భారం తగ్గించాలని, పిల్లలకు ఫోటో క్యాప్చర్ ఈ విధానం తొలగించాలని డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాలుగా అంగన్వాడి టీచర్లకు డిఏలు డిఏలు ఇవ్వడం లేదని, గ్యాస్ బిల్లులు అమలు చేయడం లేదని అన్నారు. గజ్వేల్ ప్రాజెక్టు పరిధిలో సుమారు 30 పైగా అంగన్వాడి టీచర్లు మరియు ఆయాల పోస్ట్ భర్తీ చేయకపోవడంతో పని భారం పెరుగుతుందని ఉన్నారు. అంగన్వాడి టీచర్లపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని, అక్రమంగా అరెస్టు చేస్తూ నిర్బంధాలతో ఉద్యమాలను పోరాటాలను చెప్పలేరని, సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు భవిష్యత్తులో మరింత పోరాటాన్ని హెచ్చరించారు. సమస్యలు సానుకూల దృక్పథంతో ఆలోచించి, పేదలు బలహీన వర్గాలకు సేవలందిస్తున్న అంగన్వాడి కేంద్రాలను కాపాడాలని అన్నారు లేనిచో సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు భాషయ్య, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు విజయ, సుభద్ర, కవిత పాల్గొన్నారు

## కీర్తిశేషులు మాజీ సర్పంచ్ పేరి నారాయణ రెడ్డి జ్ఞాపకార్థంగా చలివేంద్రంలో రాగిజావ పంపిణీ




**యాలాల, మండలం,మార్చి 16(సమయం న్యూస్) :** సోమవారం యాలాల మండల కేద్రం లోని చలివేద్రంలో కీర్తిశేషులు మాజీ సర్పంచ్ పేరి నారాయణ రెడ్డి జ్ఞాపకర్తంగా వారి కుమారుడు యాలాల మండల్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు పేరి రాజేందర్ రెడ్డి రాగి జావ పంపిణి చేశారు. ఈకార్యక్రమం లోగ్రామ అధ్యక్షులు రాపోల్ నాగయ్య, 6వార్డ్ నెంబర్ శేఖర్, దూస చంద్ర శేఖర్, వార్ల సులెమన్, మ్యాదరి వేణు, నర్సిరెడ్డి,బుర్నపూరి నర్సిములు,తదితరులు పాల్గొన్నారు

## శంకర్‌పల్లి మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కోరుతూ ఎమ్మెల్యే కాలే యాదయ్యకు వినతిపత్రం -ABVP



**చేవెళ్ల, మార్చి 16: (సమయం న్యూస్) :** చేవెళ్ల నియోజకవర్గంలోని శంకర్‌పల్లి మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ప్రతినిధులు చేవెళ్ల ఎమ్మెల్యే శ్రీ కాలే యాదయ్య నీ కలసి వినతిపత్రం సమర్పించారు. శంకర్‌పల్లి మండలంలో మరియు పరిసర గ్రామాల్లో ప్రతి సంవత్సరం ఇంటర్మీడియట్ పూర్తి చేసే విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం వల్ల విద్యార్థులు హైదరాబాద్, సంగారెడ్డి వంటి దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రతినిధులు వివరించారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో శంకర్‌పల్లి మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాపన చేయాలని, తద్వారా స్థానిక విద్యార్థులకు ఉన్నత విద్య సులభంగా అందుబాటులోకి రావడంతో పాటు మండల విద్యా అభివృద్ధికి దోహదం అవుతుందని పేర్కొన్నారు. ఏబీవీపీ సేవా విభాగ్ కన్వీనర్ హృషికేష్ గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం త్వరితగతిన శంకర్‌పల్లి మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు.

## శంకర్‌పల్లి మండలంలో కాలేజీ యాజమాన్యంపై ABVP ఆగ్రహం


- అదనపు ఫీజులు, అధ్యాపకుల కొరతకు నిరసన



**చేవెళ్ల, మార్చి 16:( సమయం న్యూస్) :** శంకర్‌పల్లి మండలంలోని జాగృతి డిగ్రీ కాలేజీలో విద్యార్థులపై అదనపు ఫీజులు వసూలు చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. అదేవిధంగా కాలేజీలో కొన్ని ముఖ్యమైన సబ్జెక్టులకు సంబంధించిన అధ్యాపకులు లేకపోవడం కూడా పెద్ద సమస్యగా మారింది. ముఖ్యంగా ఫిజిక్స్, హిందీ, సంస్కృతం వంటి సబ్జెక్టులకు సరైన లెక్చరర్లు లేరని విద్యార్థులు తెలిపారు. ఈ సమస్యలపై ఏబీవీపీ (ఏబీవీపీ) విద్యార్థి సంఘం స్పందించి కాలేజీ యాజమాన్యాన్ని ప్రశ్నించింది. విద్యార్థులపై అన్యాయంగా అదనపు ఫీజులు వసూలు చేయడం తక్షణమే నిలిపివేయాలని, అలాగే కాలేజీలో ఖాళీగా ఉన్న సబ్జెక్టులకు వెంటనే అధ్యాపకులను నియమించాలని డిమాండ్ చేసింది. విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని ఏబీవీపీ నాయకులు హెచ్చరించారు. సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో హృషీకేశ్ గౌడ్ స్టూడెంట్ ఫర్ సేవ శంషాబాద్ విభాగ్ కన్వీనర్, నగర కార్యదర్శి శివ కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ జైపాల్, మరియు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

- మహిళ భుజం నుండి 750 గ్రాముల ట్యూమర్ తొలగింపు
- ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ



**సమయం న్యూస్ గజ్వేల్, 16 మార్చి 2026 :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి వైద్యులు మరోసారి తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. ఆర్థిక స్థోమత లేక ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించలేని నిరుపేద రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలిచారు. గజ్వేల్ పట్టణానికి చెందిన జ్యోతి (32) భర్త హనుమంతు అనే మహిళ గత కొంతకాలంగా కుడి భుజంపై పెద్ద కణితి (ట్యూమర్) సమస్యతో బాధపడుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన ఆమె, ప్రైవేట్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకునే స్తోమత లేక గజ్వేల్ జిల్లా ఆసుపత్రిని ఆశ్రయించారు. రోగి పరిస్థితిని గమనించిన వైద్యులు వెంటనే అవసరమైన పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. ఒక బృందంగా ఏర్పడిన వైద్యులు సుమారు 750 గ్రాముల బరువున్న భారీ ట్యూమర్‌ను (నియోప్లాజమ్) విజయవంతంగా తొలగించారు. ప్రస్తుతం బాధితురాలు కోలుకుంటున్నారని, ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ, "పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే మా లక్ష్యం. శరీరంలోని కణాలు అసాధారణంగా పెరగడం వల్ల డీఎన్ఏ మార్పులు, రేడియేషన్ లేదా జన్యుపరమైన కారణాలతో ఇటువంటి ట్యూమర్లు ఏర్పడతాయి. శరీరంలో ఎక్కడైనా అసాధారణ గడ్డలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి బయాప్సీ వంటి పరీక్షలు చేయించుకోవాలి" అని సూచించారు. ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతం చేసిన జనరల్ సర్జన్ డా. ప్రేమ్ కిషోర్, అనస్థీషియా నిపుణులు డా. మహిపాల్, డా. ఇస్రత్, ఓటీ టెక్నీషియన్లు సునీల్, రాజ్‌కుమార్, స్టాఫ్ నర్సులు రాజు, పవని, ఆస్మాను సూపరింటెండెంట్ ప్రత్యేకంగా అభినందించారు. తమకు మెరుగైన వైద్యం అందించిన వైద్య బృందానికి రోగి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎంపీ డి కె అరుణమ్మ సహకారంతో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ..

- నాగసార్ గ్రామపంచాయతీ లో సిసి రోడ్డు పనులు ప్రారంభం



**దౌల్తాబాద్ మండలం, మార్చి,16(సమయం న్యూస్) :** కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలోని నాగ సార్ గ్రామపంచాయతీలో డి కె అరుణమ్మ మహబూబ్నగర్ పార్లమెంటు సభ్యురాలు యొక్క సహకారంతో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద దౌల్తాబాద్ మండలానికి వివిధ గ్రామాలలో దాదాపు 50 లక్షల సిసి రోడ్డు పనులు రావడం జరిగింది. దానిలో భాగంగానే నాగ సార్ గ్రామపంచాయతీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించడం జరిగింది మన మండలానికి నిధులు ఇచ్చినందుకు ప్రత్యేకంగా మన పార్లమెంటు సభ్యురాలు అయినటువంటి డీకే అరుణమ్మ కు కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కోలు నరసింహులు బిజెపి మండల మాజీ అధ్యక్షులు సతీష్ ముదిరాజ్ బీజెపి నాయకులు వెంకటయ్య మరియు గ్రామ సర్పంచ్ అరుణమ్మ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నారాయణపేట జిల్లా నూతన కలెక్టర్ గా ప్రతిక్ జైన్ బాధ్యతలు స్వీకరణ





**నారాయణపేట,మార్చి,16(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా నూతన కలెక్టర్ గా ప్రతీక్ జైన్ సోమవారం ఇక్కడి కలెక్టరేట్ ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, ఏవో శ్రీధర్, జిల్లా అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కలు, నోట్ పుస్తకాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రజావాణికి 25 ఫిర్యాదులు

- ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి
- కలెక్టర్ ప్రతీక్ జైన్.



**నారాయణపేట, మార్చి,16(సమయం న్యూస్) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా నూతన కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. కలెక్టర్ గా సోమవారం కలెక్టర్ ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలను కలెక్టర్ కు సమర్పించగా, ప్రజల ఫిర్యాదులను సమస్యలను సావధానంగా విన్న కలెక్టర్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి లో 119 దరఖాస్తులు స్వీకరణ

**ప్రజావాణి పెండింగ్ ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



**వికారాబాద్, మార్చి,16(సమయంలో న్యూస్) :** ప్రజావాణికి ప్రజలు జిల్లాలోని సుదూర ప్రాంతాల నుండి సమస్యల పరిష్కారం కొరకు వస్తారని, వారి ఫిర్యాదులను పూర్తి స్థాయి లో పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 119 పిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు జాగ్రత్తగా చదివి, అందులో పేర్కొన్న సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని, అవసరమైన విచారణ జరిపి సరైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా నిర్ణీత కాలంలో పరిష్కరించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల వారిగా మున్సిపాలిటీలు, పంచాయతీ రాజ్, అటవీ శాఖ, డీఆర్డీఏ, ప్రణాళిక శాఖ, భూ సేకరణ విభాగాలకు చెందిన అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై వివరణ ఇవ్వాలని కోరారు. వారంలోపు అన్ని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి, గత వారం అందిన దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించినవి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి వంటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను స్పష్టమైన నమూనాలో సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. 99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అధికారులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, మండల, మున్సిపాలిటీ, జిల్లా స్థాయిలో రోజువారీ షెడ్యూల్ ప్రకారం ప్రజలు,. ప్రజా ప్రతినిధులునిర్వహించిన కార్యక్రమాలను తప్పని సరిగా ఫోటోలు పంపించాలని సూచించారు. ప్రతి రోజూ చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, వివరాలను కార్యక్రమం అనంతరం జిల్లా అధి కారుల వాట్సాప్ గ్రూపులో అప్లోడ్ చేయాలని, ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ హార్ష్ చౌదరి జడ్.పి సి ఇ ఓ సుధీర్, ఆర్ డి ఓ వాసు చంద్ర, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రైతువేదికలో వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం పై రైతులకు అవగాహన

- రంగపూర్ గ్రామ సర్పంచ్, మందకిని అరవింద్ రావు అధ్యక్షతన..
- ఆత్మ, (బ్లాక్ ఫార్మర్స్ అడ్వైజరీ కమిటీ ) చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో
- రైతువేదికలో వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం పై రైతులకు అవగాహన
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న పరిగి మార్కెట్ కమిటీ చెర్మెన్ పరశురామ్ రెడ్డి,...
- జిల్లా వ్యవసాయ అధికారి రాజరత్నం,
- పరిగి డివిజన్ ఏడిఏ శంకర్ రాథోడ్



**పరిగి మండలం, మార్చి,16(సమయం న్యూస్) :** రంగాపూర్ గ్రామ సర్పంచ్,మందాకిని అరవింద్ రావు అధ్యక్షత న, ఆత్మ (బ్లాక్ ఫార్మర్స్ అడ్వైజరీ కమిట) చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అద్వర్యం లో రంగాపూర్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ మరియు ఆత్మ ,పరిగి డివిజన్, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ బిటిటి( బ్లాక్ టెక్నాలజీ టీమ్) కన్వీనర్ ,వారి ఆధ్వర్యంలో దీఖీూజ మరియు =ఖీూ( రికగ్నేషన్ ఆఫ్ ప్రేయర్ లెర్నింగ్ )నైపుణ్యత కొరకకు , వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం పై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో ముఖ్య అతిథి గా పాల్గొన్న పరిగి మార్కెట్ కమిటీ ఛైర్మెన్ పరశురామ్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం అవలంబిస్తున్న వివిధ రకాల పథకాల గురించి వివరించారు,ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా వ్యవసాయ అధికారి టి. రాజారత్నం వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం పై దీఖీూజ మెంబర్లకు మరియు ఆర్ పి ఎల్ శిక్షణ కార్యక్రమం లో రైతులకు సాంకేతిక పరమైన విషయాలు తెలియజేశారు. నేటి కార్యక్రమం లో వ్యవసాయ రంగంల్లో వస్తున్న కొత్త పద్ధతులు , వ్యవసాయ యాంత్రీకరణ లో నవీన మార్పులు మరియు నానో యూరియా, నానో డీఏపీ వంటి వాటిని ఉపయోగించుకోవసిన అవశ్యకత గురించి రైతులకు తెలియజేశారు. రైతు విజ్ఞాన కేంద్రం రిటైర్డ్ విచ్చేసిన విశ్రాంత శాస్త్రవేత్త డా. నరసింహ రెడ్డి వరిలో కొత్త అధిక దిగుబడి ఇచ్చే వంగడాల గురించి,ఇతర పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ యాజమాన్యం పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం మరియు నూనె గింజల పంటల సాగు ముఖ్యంగా కృషి వాస్ యాప్ గురించి పంటలకు వచ్చే వివిధ రకాల చీడపీడల గురించి ముందే గుర్తించి రైతులకు తెలియచేస్తుంది అని క్లియర్ గా వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కే శంకర్ రాథోడ్ రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం లో భాగంగా ఉన్న సదుపాయాలు మరియు రాయితీ పై రైతు సంఘాలకు డ్రోన్ లు అందుబాటులో ఉన్నాయని ,ఆత్మ సాంకేతిక యాజమాన్య సంస్థ కింద ఈ సంవత్సరం విడుదల చేయబడిన రైతుల శిక్షణ కార్యక్రమాలను బిఎఫ్ఏసి మెంబర్ల తీర్మానం తో మండలాల వారిగా కేటాయించడం జరిగింది అని తెలియజేశారు. తరువాత రైతు క్షేత్రం లో పంటలపై పిచికారి చేయు డ్రోన్ పనితీరు విధానం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఆర్గానిక్ ఫార్మర్ నారాయణ, ఆర్గానిక్ పద్ధతిలో సాగుచేస్తున్న పంటల గురించి , వివిధ రకాల కాషాయాల గురించి కళ్లకు కట్టినట్టి వివరించారు, ఈ కార్యక్రమంలో పరిగి డివిజన్లోని వివిధ మండల వ్యవసాయ అధికారులు , వ్యవసాయ విస్తరణ అధికారులు, ఆత్మ స్టాఫ్ బీ టి ఎం కె.గణేష్ , నానో డీఏపీ, కొరమడల్ ప్రతినిధులు ప్రసాద్, శ్రీకాంత్, మరియు నానో యూరియా ప్రతినిధులు, ఇఫ్కో చంద్రన్న ,ంజూఅఐ హుస్సేన్,డ్రోన్(జఎశీఎఱఎ ) ప్రతినిధులు హేమంత్ రాజు,వివిధ గ్రామాల సర్పంచ్లు,వివిధ గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

# గవర్నర్ ప్రసంగం అంతా 'గాలిలో మేడలే' క్షేత్రస్థాయిలో వాస్తవాలు వేరు

- బతుకమ్మ లేని తెలంగాణ తల్లి.. ఆత్మ లేని దేహం!
- ఉద్యమ చరిత్రను చెరిపేసేందుకే రేవంత్ సర్కార్ కుట్ర
- కప్పాటి పాండురంగారెడ్డి



**హైదరాబాద్, మార్చి 16సమయం న్యూస్ :** తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించిన బతుకమ్మ లేని తెలంగాణ తల్లి విగ్రహం ఎంత మాత్రమూ తెలంగాణ ఆత్మకు ప్రతిరూపం కాదు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితమ్మ తెలిపినట్టుగా బతుకమ్మ సమస్త తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని అన్నారు తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ కప్పాటి పాండురంగారెడ్డి. చరిత్ర నిర్మాణంలో పాల్గొనని వారు మొదట చేయాలనుకునే పని చరిత్రను చెరిపేయాలని చూడడంమని అది కుదరకపోతే వక్రీకరించాలని చూడడం అని అన్నారు. ఇప్పుడు తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న పనులు ఇవే అన్నారు. నేడు తెలంగాణలో నూటికి 90 మందికి రేవంత్ రెడ్డి కన్నా గొప్ప తెలంగాణ ఉద్యమ నేపథ్యం ఉన్నదని, తనకు స్థానం లేని ఉద్యమ చరిత్రను రూపుమాపాలి అనే అల్ప సంతోషం తప్ప ఇది మరొకటి కాదు అని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల గవర్నర్ శివప్రతాప్ శుక్లా చేసిన ప్రసంగం పట్ల తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటూ, అంకెల గారడీతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరిగిందని జాగృతి నాయకుడు విమర్శించారు.

**ప్రసంగంలోని డొల్లతనం - పచ్చి నిజాలు:** 2047 లక్ష్యం.. నేటి సంక్షోభం ఎవరికి కావాలి?: 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అని కలలు చూపిస్తున్న ప్రభుత్వం, ప్రస్తుతం అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని ఎలా గట్టెక్కిస్తుందో చెప్పడం లేదు. భవిష్యత్తు గురించి ఊహాచిత్రాలు గీస్తూ, నేటి నిరుద్యోగతను, ఆర్థిక ఇబ్బందులను గాలికొదిలేశారు.

**జీహెచ్ఎంసీ విభజన - పరిపాలనా సౌలభ్యమా?** రాజకీయ స్వార్థమా?: హైదరాబాద్ నగరాన్ని విస్తరిస్తూ జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేయడం వెనుక గల అసలు ఉద్దేశం రాజకీయ ఆధిపత్యమే తప్ప ప్రజల సౌకర్యం కాదు. దీనివల్ల సామాన్యుడికి ఒరిగేదేమీ లేదు, కేవలం అధికారుల సంఖ్య, ఖర్చు పెరుగుతుంది.

**మూసీ ప్రక్షాళన - పేదల వెలివేత:** మూసీ నది ప్రక్షాళన పేరుతో వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులు ప్రకటిస్తున్నారు కానీ, దాని వల్ల నిరాశ్రయులవుతున్న వేలాది పేద కుటుంబాల పరిస్థితి ఏంటి? హిమాయత్‌సాగర్ నుంచి గాంధీసరోవర్ వరకు అభివృద్ధి అంటే.. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారమా? ఇక రైతు భరోసా - క్షేత్రస్థాయిలో అన్యాయం: 9 రోజుల్లో రూ. 9వేల కోట్లు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, ఇంకా ఎంతమంది కౌలు రైతులు, సామాన్య రైతులు సాయం అందక కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారో పట్టించుకోవడం లేదు. 'రేర్' నమూనా పేరుతో వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోంది.

**ఇందిరమ్మ ఇళ్లు - ఆచరణ సాధ్యమేనా?:** 4 లక్షల ఇళ్ల నిర్మాణం అని చెబుతున్న ప్రభుత్వం, గతంలో పెండింగ్‌లో ఉన్న ఇళ్లకు నిధులు ఎందుకు విడుదల చేయడం లేదు? కొత్త ఇళ్ల మంజూరు కేవలం కాగితాలకే పరిమితం కాకూడదు.

**బుల్లెట్ రైళ్లు, విమానాశ్రయాలు - సామాన్యుడికి దూరం:** వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల ముచ్చట దశాబ్దాలుగా వింటున్నదే. ఇవన్నీ ఎన్నికల తాయిలాలుగానే కనిపిస్తున్నాయి తప్ప, సామాన్యుడి రవాణా కష్టాలను తీర్చేవి కావు.

"ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రజాపాలన' కేవలం దరఖాస్తుల స్వీకరణకే పరిమితమైంది. పరిష్కారం చూపని 47 వేల పిటిషన్ల గణాంకాలు దేనికి సంకేతం? ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసే విధంగా ఈ ప్రసంగం ఉంది. 'జాగృతి' తెలంగాణ ప్రజల పక్షాన నిలబడి, ఈ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటుంది. అని పాండురంగారెడ్డి అన్నారు.

## నూతన కలెక్టరేట్ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

- మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన- కలెక్టర్ ప్రతీక్ జైన్



**నారాయణపేట, మార్చి,16(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద రూ. 55 కోట్ల నిధులతో కొనసాగుతున్న నూతన కలెక్టరేట్ భవన సముదాయ నిర్మాణ పనులను సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించారు. అంతకు ముందు జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ప్రతీక్ జైన్ అక్కడి నుంచి నేరుగా కొత్త కలెక్టరేట్ భవన సముదాయం వద్దకు వెళ్లి ఇప్పటి దాకా జరిగిన నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనుల గురించి ఆర్ అండ్ బి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆయన సూచించారు. భవన సముదాయ నిర్మాణ పనులతో పాటు బయట రోడ్లు,ఇతర పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. ప్రధాన రహదారికి కలెక్టరేట్ భవన సముదాయం వరకు మొరం మట్టి లెవెల్ చేయాల్సి ఉందని ఆర్ అండ్ బీ ఈ ఈ వెంకట రమణ కలెక్టర్ కు తెలిపారు. ఎస్టిమేట్ కంటే అదనంగా నిధులు అవసరం అవుతాయని అధికారులు కలెక్టర్ కు తెలపగా ముందే ఎస్టిమేట్ లో అదనపు నిధుల అవశ్యకత ను పొందు పర్చాల్సి ఉండేదని ఆయన సూచించారు. భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జరుగుతున్న పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, ఆర్ అండ్ బి ఈ.ఈ. వెంకటరమణ, డీ.ఈ. రాములు, ఏ ఈ, తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో రంజాన్ (తోఫా) కిట్ల పంపిణీ

- ముఖ్యఅతిథిగా పాల్గొని పంపిణీ చేసిన మున్సిపల్ చెర్మెన్ నందారం ప్రశాంత్



**కొడంగల్ మున్సిపల్, మార్చి,16(సమయంలో న్యూస్) :** కోడంగల్ మున్సిపల్ యందు రంజాన్ పండగను పురస్కరించుకుని ప్రభుత్వం మంజూరు చేసిన రంజాన్ కిట్లను సోమవారం మున్సిపల్ కార్యాలయం యందు మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్, కౌన్సిలర్స్ పంపిణీ చేశారు. పట్టణంలోని 12వార్డ్ లలో ఉన్న ముస్లిం సోదరులకు రంజాన్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా కొడంగల్ మున్సిపల్ చైర్మెన్ నందారం ప్రశాంత్ మాట్లాడుతూ మత సామరస్యతకు, ఐక్యతకు రంజాన్ పండగ ప్రతీకగా నిలుస్తుందని అభివర్ణించారు. రంజాన్ పండగను సంతోషంగా అందరు కలిసిమెలిసి జరుపుకోవాలన్నారు. ముస్లిం సోదరుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్, కౌన్సిలర్స్, స్థానిక మైనార్టీ సోదరులు, యువకులు పాల్గొన్నారు.

## జన గణన 2027 పథకాల అమలు,దేశ అభివృద్ధికి మూలమని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు.



**వికారాబాద్, మార్చి,16(సమయం న్యూస్):** సోమవారము ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో జన గణన--2027 నిర్వహణపై జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి అధికారులకు(ఛార్జీ అధికారులు) 3 రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం లో కలెక్టర్ పాల్గొన్నారు. జన గణన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు శిక్షణ కార్యక్రమం లో పూర్తి అవగాహన కలిగిస్తుందని అన్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో జన గణన 2027 సమర్థమంతంగా నిర్వహించేందుకు అవసరమైన విధానాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. జన గణన కార్యక్రమం రెండు దశల్లో నిర్వహించబడుతుందని తెలిపారు. మొదటి దశలో ఇళ్ల జాబితా (హౌస్‌లిస్టింగ్,హౌస్ ఎన్యూమరేషన్), గృహాల గణన నిర్వహించబడుతుందని, తెలంగాణ రాష్ట్రంలో ఈ దశ మే 11, 2026న ప్రారంభమై జూన్ 9, 2026 వరకు కొనసాగుతుందని, రెండవ దశలో జనాభా గణన (పాపులేషన్ ఎన్యుమరేషన్) ప్రక్రియ ఫిబ్రవరి 2027లో నిర్వహించబడుతుందని, మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారని అన్నారు. ఈ సంవత్సరం జరగనున్న జనాభా గణనను దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నారని, మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌లను ఉపయోగించి గణన ప్రక్రియను నిర్వహించనున్నట్లు అయన తెలిపారు. ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేందుకు (సెల్ఫ్ ఎన్యూమరేషన్) ప్రత్యేక పోర్టల్‌ను గణన ప్రారంభానికి సుమారు 15 రోజుల ముందు అంటే ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. మొదటి దశలో నిర్వహించబడే ఇళ్ల జాబితా మరియు గృహాల గణనలో ఇంటి నిర్మాణం (కచ్చా పక్కా,తదితర,) ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, త్రాగునీటి సౌకర్యం, మురుగునీటి పారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంటగది సౌకర్యం వంటి వివరాలతో పాటు రేడియో, టెలివిజన్, స్మార్ట్ ఫోన్ , కంప్యూటర్, సైకిల్, కారు వంటి గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 33 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సేకరించే విధానాన్ని ఈ శిక్షణలో వివరించనున్నట్లు తెలిపారు. ప్రతి మండలంలోని రెవెన్యూ గ్రామాలను, పట్టణాల్లోని వార్డులను గణన బ్లాకులుగా ఎలా విభజించాలి, గణన ప్రక్రియను ఎలా నిర్వహించాలి అనే అంశాలపై అధికారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ శాఖల అధికారుల బాధ్యతలను వివరించారు. అన్ని శాఖల సమన్వయంతో జనాభా గణన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్నిడైరెక్టేట్ ఆఫ్ ప్లానింగ్ శాఖ జనాభా లెక్కల అధికారులుశ్రీకాంత్ నాయక్, వంగ పండు గీత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జన గణన,హౌస్ లిస్టింగ్,ఎన్యూమరేషన్ చేయడం శిక్షణ లో అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డి ఆర్ ఓ మాంగీ లాల్ ,తాండూర్ డి ఆర్ ఓ అనిత ,ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటేశ్వర్లు,జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, అన్ని మండలాల తహసీల్దార్ లు, మున్సిపల్ కమిషనర్ లు తదితరులు పాల్గొన్నారు.

## చెట్టుకొమ్మ విరిగి వ్యక్తి మృతి



**పటాన్ చెరు (గుమ్మడిదల), మార్చి 16 (సమయం న్యూస్) :** ప్రమాదవశాత్తూ చెట్టు కొమ్మ విరిగి కింద పడడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గుమ్మడిదల నివాసి అడవి వీరేష్ (45) స్థానిక మున్సిపల్ కేంద్రంలో ఉన్న పాత ఎమ్మార్వో కార్యాలయం సమీపంలోని మామిడి చెట్టుపైకి ఎక్కి మామిడి కాయలు తెంపుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ చెట్టు కొమ్మ విరిగిపడి కింద పడిపోయాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలు అయ్యా యి. గాయపడిన వీరేష్‌ను వెంటనే 108 అంబులెన్స్‌లో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చగా, అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి సోదరి బండాల ఉమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గుమ్మడిదల ఎస్సై రమాకాంత్ రెడ్డి తెలిపారు.

## మనస్థాపంతో వ్యక్తి బలవన్మరణం

**పటాన్ చెరు (గుమ్మడిదల), మార్చి 16 (సమయం న్యూస్):** మనస్థాపానికి గురై ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల గ్రామానికి చెందిన పోచగారి రాజిరెడ్డి (43) సోమవారం తన పొలం సమీపంలో ఉన్న కరెంట్ టవర్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడు తన భార్య కవితతో చిన్నచిన్న విషయాలపై తరచూ గొడవపడేవాడని సమాచారం. సోమవారం ఉదయం మద్యం సేవించి ఇంటికి వచ్చిన రాజిరెడ్డిని మద్యం సేవించడం మానివేయాలని భార్య కవిత మందలించడంతో ఇద్దరి మధ్య మళ్లీ వాగ్వాదం జరిగింది. దీంతో కవిత తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ విషయంపై మనస్తాపానికి గురైన రాజిరెడ్డి తన పొలం సమీపంలో ఉన్న అమ్మగారి సంజీవరెడ్డి పొలంలోని కరెంట్ టవర్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడి సోదరుడు మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గుమ్మడిదల ఎస్సై రమాకాంత్ రెడ్డి తెలిపారు.

## విద్యార్థులు ఉన్నత చదువుల పైన దృష్టి సారించాలి: "షీ" టీమ్ పోలీసులు

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు






**నారాయణపేట, మార్చి,16(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని లిటిల్ స్టార్స్ పాఠశాలలో సోమవారం "షీ" టీమ్ పోలీసులు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వంటి సమస్యలపై వివరించారు. అలాగే అధికంగా సెల్‌ఫోన్ వినియోగించడం వల్ల కలిగే అనర్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగం వల్ల ఎదురయ్యే ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండి ఉన్నత చదువులపై దృష్టి సారించాలని సూచించారు. అమ్మాయిలు ఏదైనా వేధింపులకు గురైతే నిర్భయంగా పోలీసులకు "షీ టీమ్ చీశీ. 8713670398 కి ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదు చేసిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ సందర్భంగా "షీ" టీమ్ కానిస్టేబుల్ బాలరాజు, చేనప్ప లు మాట్లాడుతూ... విద్యార్థులు తమ భద్రతపై అప్రమత్తంగా ఉండాలని, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులతో ఏ సమస్యనైనా పంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, "షీ"టీమ్ పోలీసులు జ్యోతి, కవిత మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలలో సిజిఆర్





**పటాన్ చెరు (జిన్నారం), మార్చి 16 (సమయం న్యూస్):** జిన్నారం మున్సిపల్ పరిధిలోని పెద్దమ్మగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలలో సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో నిర్వహించిన శ్రీ మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, చిమ్ముల గోవర్ధన్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్‌తో కలిసి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కళ్యాణోత్సవాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన భక్తుల కోసం సిజిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థుల 8,500కోట్ల స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి.

- రాష్ట్రంలోని విద్యారంగానికి కనీసం 15% బడ్జెట్ కేటాయించాలి.
- విద్యారంగం సమస్యలపై వెంటనే రాష్ట్రం స్పందించాలి.
- ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుర్వ మహిపాల్.




**చేవెళ్ల మార్చి 16 ( సమయం న్యూస్) :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ చేవెళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పత్రిక విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుర్వ మహిపాల్ గారు మాట్లాడుతు విద్యార్థుల సమస్యలపై ముఖ్యమైన అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. రాబోయే మార్చి 20న ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి కనీసం 15 శాతం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఒక రాష్ట్ర అభివృద్ధి విద్యపై ఆధారపడి ఉంటుందని, విద్యను బలోపేతం చేయకుండా రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమ స్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యాశాఖకు ఇప్పటివరకు పూర్తిస్థాయి మంత్రి నియామకం జరగకపోవడం వల్ల విద్యారంగానికి సంబంధించిన అనేక కీలక నిర్ణయాలు ఆలస్యమవుతున్నాయని తెలిపారు. అందువల్ల వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇంకా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్లు మరియు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. స్కాలర్షిప్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ ఆలస్యం కావడం వల్ల అనేక మంది విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువు కొనసాగించడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొన్ని సందర్భాల్లో ఫీజులు చెల్లించలేక విద్యార్థులు కళాశాలలకు హాజరు కాలేకపోతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ఇది విద్యార్థుల భవిష్యత్తుకు ప్రమాదకరమని పేర్కొన్నారు. విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు అని, ఆ హక్కును రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న అన్ని స్కాలర్షిప్లు మరియు ఫీజు రీయింబర్స్మెంట్లను విడుదల చేయడంతో పాటు విద్యారంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో విద్యార్థి ఉద్యమాలు చేపడతామని హేచ్చరించారు ఈ కార్యక్రమం లో నగర కార్యదర్శి హారిక, అనిల్, ప్రశాంత్ ,లోకేష్ ,జైపాల్ తదితరులు పాల్గొన్నారు

## నవాంద్గీ సంగమేశ్వర దేవాలయంలో అన్నప్రసాద వితరణ





**బషీరాబాద్,మండలం, మార్చి,16(సమయం న్యూస్) :** తాండూరు నియోజకవర్గం లోని బషీరాబాద్ మండలం నావాంద్గీ లో కొలువుదీరిన కూడల సంగమేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం అన్నప్రసాద వితరణ భక్తిశ్రద్ధలతో సాగింది. డాక్టర్ జ్యోతిరావు పూలే అంబేడ్కర్ సామాజిక సేవ జాతీయ అవార్డు గ్రహీత మల్లారెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో ముందుగా సంగమేశ్వర స్వామికి గ్రామస్తులందరితో కలిసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు సాగాయి. అనంతరం అన్నప్రసాద వితరణ సాగింది. సోమవారం కావడంతో నావాంద్గీ తో పాటు ఇందర్ చేడ్, బషీరాబాద్, కర్ణాటక రాష్ట్ర హల్ కోడా గ్రామానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సర్పంచ్ శ్రీకాంత్, బషీరాబాద్ నవాంద్గీ మాజీ సర్పంచ్ లు జయ్యమ్మ నర్సింలు, ఈరమణి మధుసూదన్ రెడ్డి, నీటి సంఘం మాజీ చైర్మన్ లు వీరణఢ, మహిపాల్ రెడ్డి, ప్రైడ్ ఆఫ్ భారత రత్న అవార్డు గ్రహీత ఎడ్ల సురేష్, పల్లెర్ల ప్రతాప్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, చెన్నారెడ్డి, ఉప సర్పంచ్ కిష్టప్ప , వార్డు సభ్యులు , మాజీ ఉప సర్పంచ్ ఎడ్ల గోపాల్, వార్డు సభ్యులు రామకృష్ణా, సురేష్, మంగలి నర్సింలు,అనంతమ్మ,మాలిన్ బీ, అన్వర్, రఘుమారెడ్డి, పల్లెర్ల ప్రతాప్ రెడ్డి, యాస వెంకట్ రాం రెడ్డి,యాస జనార్దన్ రెడ్డి, సులేగాం రవిందర్ రెడ్డి, యాస బిచ్చి రెడ్డి,యాస చక్రధర్ రెడ్డి ,ప్రశాంత్ రెడ్డి, మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.



## రక్తదాన శిబిరం: 49 మంది యువతీ, యువకులు స్వచ్ఛందంగా రక్తదానం

- శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయం చైర్మన్ గోపాల్ రెడ్డి

**చేవెళ్ల మార్చి 16 (సమయం న్యూస్) :** రక్తదానం ప్రాణదానంతో సమానం అని మరకత శివాలయం చైర్మన్ గోపాల్ రెడ్డి అన్నారు. సోమవారం శంకర్‌పల్లి మండలం చందిప్ప గ్రామ శివారులో గల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయ ఆవరణలో వివేకానంద బ్లడ్ బ్యాంక్ మెహదీపట్నం సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్వచ్ఛందంగా 49 మంది యువతి, యువకులు రక్తదానం చేయగా, వారికి సర్టిఫికెట్లు ఇచ్చినట్లు ఆర్గనైజర్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎంతో మంది మృతి చెందుతున్నారన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒక్కసారి రక్తదానం చేయాలని కోరారు. 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల లోపు ఉన్న ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ రక్తదాన శిబిరంలో 350 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు చెప్పారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, డా. సంజీవ, డా. రాజు ఉన్నారు.




## ఉత్సాహంగా ముగిసిన నిహాన్ షోటోకన్ జాతీయ స్థాయి కరాటే పోటీలు

- శంకర్‌పల్లికి చెందిన అనిల్ టీం రీత్విక్ రాజ్ గైక్వాడ్ గెలుపు

**చేవెళ్ల మార్చి 16: (సమయం న్యూస్):** సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 14, 15 తేదీలలో 'నిహాన్ షోటోకన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కరాటే పోటీలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ పోటీలను "హన్సి వి. రవీందర్ కుమార్," "షిహాన్ ఈ. శ్రీనివాసులు" సంయుక్తంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ టోర్నమెంట్లో దేశవ్యాప్తంగా సుమారు 1200 మంది కరాటే క్రీడాకారులు పాల్గొని కటా, కుమిటి విభాగాలలో తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల ప్రారంభోత్సవానికి "జి7 ఛానల్ చైర్మన్ గణేష్," "ఈ వింగ్స్ డైరెక్టర్ రామకృష్ణ." "లక్ష్యసాధన ఫౌండేషన్ చైర్మన్ ప్రజ్ఞ రాజు" తదితరులు హాజరయ్యారు. అలాగే కియో ఆర్గనైజేషన్ రెఫరీలు విజయ్, సయ్యద్ అక్బర్ అలీ, కనకరాజు, రాష్ట్ర బాధ్యులు వి. నరేందర్, సి. హెచ్ సాయికుమార్, అనిల్ కుమార్ పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో ఫస్ట్ బెస్ట్ టీం కప్ ను 'హైదరాబాద్ శంకర్‌పల్లికి చెందిన అనిల్ టీం గెలుచుకోగా రీత్విక్ రాజ్ గైక్వాడ్, రెండవ టీం కప్ ను విఎన్ఆర్ కరాటే అకాడమీకి చెందిన నరేందర్ టీం, మూడవ టీం కప్ ను అశోక చక్రవర్తి టీం దక్కించుకుంది. విజేతలకు కప్పులు, మెడల్స్, మెమెంటోలు అందజేశారు. పాయింట్ల ఆధారంగా 217 పాయింట్లతో తెలంగాణ మొదటి స్థానం, 116 పాయింట్లతో ఆంధ్రప్రదేశ్ రెండవ స్థానం, 76 పాయింట్లతో మూడవ స్థానం సాధించాయి. ఈ పోటీలు ఉత్సాహభరితంగా సాగి విజయవంతంగా ముగిశాయి.



## అమరజీవి విగ్రహంపైనా విమర్శలా


**దోపిడీ న ఏతలకు త్యాగాలు ఎలా రుచిస్తాయి**

**వైసిపి నేతల తీరుపై మండిపడ్డ మంత్రి నిమ్మల**

**అమరావతి,మార్చి16 (సమయం న్యూస్):** అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న విమర్శలు అత్యంత దుర్మార్గమని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. కేవలం దోపిడీలు, లూటీలకు అలవాటుపడిన వైసీపీ నేతలు, దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాల విలువ ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. సోమవారం అమరావతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పాలనపై, ఆయన వ్యక్తిత్వంపై నిమ్మల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ద్రోహం, ఎవరికీ సాయం చేయకూడదనేది జగన్ డీఎన్ఏలోనే ఉంది. సొంత తల్లి, చెల్లిని కూడా మోసం చేసిన చరిత్ర ఆయనది. గత ఐదేళ్ల పాలనలో జగన్ ప్రభుత్వం సుమారు రూ.14 లక్షల కోట్ల అప్పులు చేసి, ఏపీ ఆర్థిక వ్యవస్థను కుప్ప కూల్చారు. రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టి అడ్డగోలుగా అప్పులు చేశారు. ఆ నిధులు ఎక్కడికి వెళ్లాయో జగన్ సమాధానం చెప్పాలి. పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేస్తే.. జగన్ అధికారం కోసం ఆస్తులను, వ్యవస్థను దోచుకున్నారు. త్యాగధనుల విగ్రహాలపై విమర్శలు చేయడం వారి దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట. వైసీపీ హయాంలో జరిగిన ఆర్థిక అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, ప్రజల సొమ్మును రక్షిస్తాం' అని అన్నారు.

## వివేకా హత్య కేసులో సీబీఐ కోర్టు విచారణ

**19వ తేదీలోపు అఫిడవిట్ ఫైల్ చేయాలని ఆదేశం**



**హైదరాబాద్, మార్చి 16(సమయం న్యూస్):** సోమవారం సీబీఐ ప్రత్యేక కోర్టులో మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను నిందితులకు అందజేశామని సీబీఐ అధికారులు కోర్టుకు తెలిపారు. ఇదే సమయంలో నిందితుల తరపు లాయర్లకు కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సీబీఐ నుంచి కేసు వివరాలు అందినట్లు అఫిడవిట్ ఫైల్ చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ నెల 19వ తేదీ లోపు అఫిడవిట్‌ను సమర్పించాలని స్పష్టం చేసింది. కేసులో తదుపరి న్యాయ ప్రక్రియలు కొనసాగేందుకు అవసరమైన పత్రాలను సమయానికి దాఖలు చేయాలని కూడా కోర్టు సూచించింది. నిందితుల నుంచి అఫిడవిట్లు వచ్చిన అనంతరం తదుపరి దశలో విచారణ కొనసాగిస్తామని పేర్కొంది. తదుపరి విచారణను బుధవారానికి సీబీఐ కోర్టు వాయిదా వేసింది. దీంతో వివేకా హత్య కేసు విచారణలో మరిన్ని పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని అభిప్రాయ పడుతున్నారు. రోవైపు వివేక హత్య కేసుపై కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పలు వ్యాఖ్యలు చేశారు. 'వివేకా కేసులో సునీత పోరాటం న్యాయం కోసమేనా?. ఆమె ప్రతిసారి కోర్టుకు వెళ్తూ దర్యాప్తును అడ్డుకుంటున్నారు. మేము నిర్దోషులం అని నిరూపించుకుంటాం. సీబీఐ, కోర్టును విమర్శించేలా సునీత మాట్లాడారు. గుండెపోటు స్టోరీ పుట్టించిందే సునీతా రెడ్డి. వివేకా వేరే సంబంధాల గురించి దస్తగిరి చెప్పినా... ఆ కోణంలో దర్యాప్తు చేయడం లేదు' అని ఎంపీ అవినాష్ రెడ్డి అన్నాడు.

## అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

**నంద్యాల, మార్చి 16 (సమయం న్యూస్)::** మండలంలోని ముత్తలూరు గ్రామ మెట్ట సమీపంలో కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకు వెళ్ళింది. ఈ ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాల మేరకు. ఆదివారం రాత్రి అహోబిలం వైపు నుంచి ఆళ్లగడ్డ కు వస్తున్న కారు ముత్తలూరు మెట్ట మలుపు దగ్గర అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలు అయినట్లు గ్రామస్తులు తెలిపారు. గాయపడినవారిని 108 వాహనం ద్వారా ద్వారా ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అన్నారు. కారులో ప్రయాణిస్తున్నవారు తెలంగాణ వాసులుగా తెలుస్తోంది. ప్రమాదంలో కారు పూర్తిగా దెబ్బతిన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# జూన్ కోటా శ్రీవారి ఆర్జిత సేవలు

**• 18న ఆన్‌లైన్‌లో విడుదల**

**తిరుమల,మార్చి16 (సమయం న్యూస్):** భక్తుల సౌకర్యార్థం జూన్ నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవలు సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ టికెట్లకు ఎలక్ట్రానిక్ డిప్‌లో పేర్ల నమోదు ఈ నెల 18న ఉదయం 10 గంటలకు తితిదే వెబ్‌సైట్‌లో ప్రారంభం కానుంది. ఈ టికెట్లకు ఈ నెల 20న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం డిప్‌లో ఎంపిక చేస్తారు. డిప్‌లో ఈ-టికెట్లు పొందిన వారు మార్చి 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లిస్తే.. టికెట్లు మంజూరవుతాయి. 21న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను మధ్యాహ్నం 3 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను విడుదల చేయనున్నారు. 23న ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శన టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. 24 ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశదర్శనం రూ.300 టికెట్ల కోటాను ఆన్‌లైన్‌లో



విడుదల చేస్తారు. అదే రోజు.. మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ కోటాను విడుదల చేస్తారు. భక్తులు టిటిడి అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలని తితిదే అధికారులు సూచించారు.

# పదోతరగతి పరీక్షలు ప్రారంభం

- గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు
- అర గంట ముందుగానే లోపలికి అనుమతి
- క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి అనుమతి
- విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి లోకేశ్



**అమరావతి, ఫిబ్రవరి 16 (సమయం న్యూస్):** ఎపిలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సోమవారం నాడు ప్రారంభం అయ్యాయి. గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని విద్యా శాఖ అధికారులు సూచించడంతో గంట ముందుగానే విద్యార్దులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్దులను వారి తల్లి తండ్రులు,పాఠశాల ఉపాధ్యాయులు వెంట వచ్చి పరీక్ష కేంద్రాలకు తీసుకొచ్చారు. బస్సుల్లో, ఆటోల్లో, బైక్ లు మీద తల్లి తండ్రులు, ప్రైవేటు స్కూళ్లు యాజమాన్యాలు విద్యార్దులను పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు హాల్ టికెట్స్ నెంబర్ ఆధారంగా రూం కేటాయింపు చూసుకున్నారు. అనంతరం అరగంట ముందు విద్యార్దులను పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించారు. విద్యార్దులు దగ్గర ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఉన్నాయా అనేది చెక్ చేసి పరిశీలించి లోపలికి పంపించారు. బాలురకు పురుషులు, బాలికలకు స్త్రీ సిబ్బంది చెక్ చేసి లోపలికి అనుమతించారు. రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఏప్రిల్ 1వ తేదీతో ఈ పరీక్షలు ముగియనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ పరీక్ష నిర్వహించనున్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో 10 గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. ఈ పరీక్షలకు సంబంధించి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. విద్యార్థుల హాల్ టికెట్ చూపించి, ఆర్టీసీ బస్సుల్లో పరీక్షా కేంద్రాలకు ఉచితంగా చేరుకోవచ్చు. ఈ ఏడాది మొత్తం 6,40,916 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులు వెంట వచ్చిన తల్లి తండ్రులు,ఉపాధ్యాయులు స్నేహితులు బెస్ట్ ఆఫ్ లక్ చెబుతూ వారికి ధైర్యం చెబుతూ శుభాకాంక్షలు తెలియజేసారు. పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికీ రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. ఏ మాత్రం ఒత్తిడికి గురికావద్దు. ప్రశాంతంగా ఉండండి అంటూ విద్యార్థులకు ఆయన కీలక సూచన చేశారు. ఈ పరీక్షల్లో 100 శాతం మీ ప్రతిభను ప్రదర్శించే సమయం ఇదని విద్యార్థులకు ఈ సందర్భంగా మంత్రి సూచించారు. ప్రణాళికాబద్ధంగా పరీక్షలు రాయండంటూ వారికి ఆయన స్పష్టం చేశారు. విజయం మీదే. ఆల్ ది బెస్ట్ అంటూ వారికి మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు చెప్పారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా 10వ తరగతి విద్యార్థులకు మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు చెప్పారు.

**పరీక్ష హాలులో పాము ప్రత్యక్షం**

**కడప:** కడప జిల్లా బి.కోడూరులోని పదో తరగతి పరీక్ష కేంద్రంలోకి పాము రావడం కలకలం రేపింది. పామును చూసిన విద్యార్థులు ఒక్కసారిగా పరుగులు పెట్టారు. వెంటనే అక్కడి సిబ్బంది పామును చంపి బయటపడేయడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ఉదయమే పరీక్షకు హాజరైన విద్యార్థులు తమకు కేటాయించిన రూమ్‌లోకి ఎంటర్ అయ్యారు. అక్కడ లోపల ఉన్న పామును చూసి అరుస్తూ విద్యార్థులు బయటకు పరుగులు తీసారు. విషయం తెలిసిన అధికారులు వెంటనే పామును పట్టుకునే ప్రయత్నం చేశారు. పామును పట్టుకుని తరలించడంతో ఊపిరి పీల్చుకున్నారు. చివరకు ప్రశాంతంగా పరీక్షహాల్లోకి ఎంటర్ అయ్యారు.



## నలుగురికి యావజ్జీవ కారాగారం

**కడియం మహిళ హత్యాచారం కేసులో రాజమండ్రి కోర్టు సంచలన తీర్పు**



**రాజమండ్రి, మార్చి 16 (సమయం న్యూస్):** తూర్పుగోదావరి జిల్లా కడియం నర్సరీలో గతేడాది వివాహితపై జరిగిన సామూహిక అత్యాచారం మరియు హత్య కేసులో రాజమండ్రి కోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. నిందితులైన నలుగురు యువకులకు మరణం వరకు జీవిత ఖైదు విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. కడియం మండలం బుర్రిలంక గ్రామానికి చెందిన రైతు కస్తూరి (43) స్థానిక నర్సరీలో పని చేసేవారు. 2024 అక్టోబర్ 15న ఆమె పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో, మద్యం మత్తులో ఉన్న నలుగురు యువకులు ఆమెను అడ్డగించారు. ఆమె కాళ్లు చేతులు కట్టేసి నర్సరీ మొక్కల మధ్యకు తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం తమ నేరం ఎక్కడ బయటపడుతుందోనన్న భయంతో ఆమెను హత్య చేసి, సమీపంలోని ప్రధాన పంట కాలువలో పడేశారు. అక్టోబర్ 17న ఆమె మృతదేహం లభ్యమవ్వడంతో ఈ ఘోరం వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఈ కేసులో బుర్రిలంకకు చెందిన దేవర యేసు (21), వెలుబుడి ప్రవీణ్ (21), లోకిన జయప్రసాద్ (19) మరియు పొట్టిలంకకు చెందిన దాసరి సురేష్ (22)లను అరెస్ట్ చేశారు. సౌత్ జోన్ డీఎస్పీ భవ్య కిషోర్ నేతృత్వంలో పోలీసులు వేగంగా దర్యాప్తు పూర్తి చేసి చార్జ్ షీట్ దాఖలు చేశారు. రాజమండ్రి నాలుగవ అదనపు జ్యుడీషియల్ కోర్టు ఈ కేసును ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో విచారించింది. నిందితుల నేరం రుజువు కావడంతో, న్యాయమూర్తి వారికి మరణం వరకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు ప్రకటించారు. జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ మాట్లాడుతూ, మహిళలపై జరిగే నేరాలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కేవలం 11 నెలల్లోనే విచారణ పూర్తి చేసి, మొత్తం 14 నెలల్లోనే బాధితురాలి కుటుంబానికి న్యాయం చేకూర్చామని ఆయన వెల్లడించారు. జిల్లాలో పోక్సో మరియు మహిళా వేధింపుల కేసులు తగ్గుముఖం పట్టేలా కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

# లొంగిపోయిన సిద్ధార్థ్ రెడ్డి

**నటి ప్రత్యూష కేసులో మరో కీలక పరిణామం**

**హైదరాబాద్, మార్చి 16 (సమయం న్యూస్):** తెలుగు రాష్ట్రాలో ఒకప్పుడు సంచలనం సృష్టించిన సినీనటి ప్రత్యూష మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత నటి ప్రత్యూష మృతి కేసులో నిందితుడిగా ఉన్న సిద్ధార్థ్ రెడ్డి 24 ఏళ్ల తర్వాత మీడియా ముందుకు వచ్చాడు. సుప్రీంకోర్టు తుది తీర్పు మేరకు ఆయన హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో లొంగిపోయాడు. ఈ కేసు రెండు దశాబ్దాలుగా న్యాయస్థానాల్లో కొనసాగుతోంది. సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తుది తీర్పుతో కేసులో మరో కీలక మలుపు తిరిగింది.

**అమెరికాలో స్థిరపడిన సిద్ధార్థ్ రెడ్డి**

నటి మరణ ఘటన తర్వాత సిద్ధార్థ్ రెడ్డి అమెరికాకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. చాలాకాలంగా విదేశాల్లో ఉన్న ఆయన, సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో భారత్‌కు వచ్చి కోర్టులో లొంగిపోయారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం నాలుగు వారాల్లోగా లొంగిపోవాలని చెప్పడంతో, ఆ గడువు లోపే నాంపల్లి కోర్టుకు వచ్చి సమర్పణ చేశాడు. ఈ ఘటన 2002 ఫిబ్రవరి 23వ తేదీన జరిగింది. అప్పట్లో నటి ప్రత్యూష, సిద్ధార్థ్ రెడ్డి ఇద్దరూ కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన తర్వాత ఇద్దరినీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రత్యూష ప్రాణాలు కోల్పోయింది. అయితే సిద్ధార్థ్ రెడ్డి చికిత్స అనంతరం కోలుకున్నారు. ఈ సంఘటన ఆ సమయంలో తెలుగు సినీ పరిశ్రమలో పెద్ద సంచలనంగా మారింది. ప్రత్యూష మృతి తర్వాత ఆమె కుటుంబ సభ్యులు, ముఖ్యంగా ఆమె తల్లి ఈ ఘటనపై తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. ఇది ఆత్మహత్య కాదని, హత్య జరిగి ఉండొచ్చని ఆమె ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆమె తల్లి న్యాయపోరాటం ప్రారంభించారు. కేసును కోర్టులో కొనసాగిస్తూ నిజం బయటకు రావాలని పట్టుదలగా పోరాడారు. పోలీసుల దర్యాప్తు అనంతరం సిద్ధార్థ్‌రెడ్డిపై ఆత్మహత్యకు ప్రేరేపించినట్లుగా అభియోగాలు నమోదయ్యాయి. కేసు ట్రయల్ కోర్టులో విచారణకు వచ్చింది. ట్రయల్ కోర్టు విచారణలో ఆయనను దోషిగా నిర్ధారిస్తూ ఐదేళ్ల జైలు శిక్ష విధించింది.

**హైకోర్టు శిక్ష తగ్గింపు**

ట్రయల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ సిద్ధార్థ్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును పరిశీలించిన తెలంగాణ హైకోర్టు శిక్షను కొంత తగ్గించింది. ఐదేళ్ల జైలు శిక్షను రెండు సంవత్సరాలకు తగ్గిస్తూ తీర్పు ఇచ్చింది. దీంతో కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సిద్ధార్థ్ రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు చాలాకాలం పాటు సుప్రీంకోర్టులో విచారణలో కొనసాగింది. చివరకు సుప్రీంకోర్టు హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. సిద్ధార్థ్‌రెడ్డి వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది.

**నాలుగు వారాల్లో లొంగిపోవాలని ఆదేశం..**

తుది తీర్పులో భాగంగా సుప్రీంకోర్టు సిద్ధార్థ్‌రెడ్డికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. నాలుగు వారాల్లోగా కోర్టులో లొంగిపోవాలని



ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు ఆయన హైదరాబాద్‌కు వచ్చి నాంపల్లి కోర్టులో లొంగిపోయారు.

**24 ఏళ్ల తర్వాత మరోసారి చర్చలో కేసు..**

దాదాపు 24 ఏళ్ల తర్వాత ఈ కేసు మళ్లీ వార్తల్లోకి వచ్చింది. నటి ప్రత్యూష మరణం అప్పట్లో తెలుగు సినీ పరిశ్రమను కుదిపేసిన ఘటనగా గుర్తింపు పొందింది. ఇప్పుడు సుప్రీంకోర్టు తుది తీర్పుతో ఈ కేసులో న్యాయపరమైన ప్రక్రియ కీలక దశకు చేరుకుంది.

# కుర్మపల్లెలో పారిశుద్ధ్యానికి సబర్మతి యూత్ ముందడుగు

- వార్డులో ఇరవై చెత్త బుట్టల ఏర్పాటు
- యువత సామాజిక బాధ్యత అభినందనీయం: ఎంపీడీవో రవీందర్ రావు



**గొల్లపల్లి, మార్చి 16 (సమయం న్యూస్) :**
జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని తొమ్మిదో వార్డు (కుర్మపల్లె)లో పరిశుభ్రతను పెంపొందించే లక్ష్యంతో సామాజిక సేవా సంస్థ 'యువ సబర్మతి యూత్' సభ్యులు గొప్ప ముందడుగు వేశారు. వార్డు పరిధిలోని వివిధ ప్రాంతాలలో ఇరవై చెత్త బుట్టలను ఏర్పాటు చేశారు. ఈ చెత్త బుట్టలను వెల్పుల రాము సౌజన్యంతో అందించారు.

## ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

ఈ సందర్భంగా సబర్మతి యూత్ సభ్యులు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, డైపర్లు, టానిక్ సీసాలు వంటి చెత్తను బహిరంగ ప్రదేశాల్లో లేదా డ్రైనేజీల్లో పడేయడం వల్ల వర్షపు నీరు నిలిచి దోమలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులు చెత్తను శుభ్రం చేయడంలో కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అందువల్ల చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త బుట్టల్లో వేయడం ప్రతి ఒక్కరూ అలవాటుగా మార్చుకోవాలని ప్రజలకు సూచించారు.



## యువత చొరవ అభినందనీయం

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) రవీందర్ రావు, మండల పరిషత్ అధికారి (ఎంపో) ప్రదీప్ యాదవ్ పాల్గొన్నారు. ఎంపీడీవో రవీందర్ రావు మాట్లాడుతూ.. యువత ముందుకు వచ్చి ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అత్యంత అభినందనీయమని కొనియాడారు. సమాజంలో పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ప్రతి గ్రామంలోనూ ఇలాంటి పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువ సబర్మతి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# పోలీసులతో ప్రజల సహకారమే నేర రహిత సమాజానికి పునాది

- సీఐ ప్రవీణ్ కుమార్
- రహస్య సంఖ్యలు, లింకులు పంచుకుని సైబర్ మోసగాళ్ల బారిన పడొద్దు
- మద్యపాన నిషేధం అమలు చేస్తున్న రాంపల్లి గ్రామస్థులు అందరికీ ఆదర్శం



**పెద్దపల్లి, మార్చి 16 (సమయం న్యూస్) :**
గ్రామీణ ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడం ద్వారానే నేరాలను సమర్థవంతంగా నివారించవచ్చని పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేశ్ ఆధ్వర్యంలో రాంపల్లి గ్రామంలో నిర్వహించిన సైబర్ మోసాలు, రహదారి భద్రత అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పోలీసులతో మమేకమై చట్టాలను గౌరవిస్తేనే ప్రశాంతమైన సమాజం ఏర్పడుతుందని స్పష్టం చేశారు.

## అప్రమత్తతే ఆయుధం

ప్రస్తుత డిజిటల్ కాలంలో సైబర్ నేరగాళ్లు విసిరే వలల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ నమ్మి వ్యక్తిగత వివరాలు, రహస్య సంఖ్యలు (ఓటీపీ), లింకులు ఇతరులకు పంచుకోకూడదని వివరించారు. అలాగే రహదారి నిబంధనల విస్మరణే ప్రమాదాలకు హేతువని హెచ్చరించారు. హెల్మెట్ ధరించడం, అతివేగాన్ని నియంత్రించుకోవడం ప్రాణరక్షణకు మార్గాలని, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు.



## సామాజిక మార్పుకు శ్రీకారం

రాంపల్లి గ్రామస్థులు సామాజిక బాధ్యతతో తీసుకున్న నిర్ణయాలను సీఐ మనస్ఫూర్తిగా అభినందించారు. గ్రామంలో మద్యపాన నిషేధం అమలు చేయడం, బెల్ట్ షాపుల నిర్మూలన, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపుపై గ్రామస్థులు ఏకగ్రీవంగా తీసుకున్న తీర్మానం గొప్ప విషయమన్నారు. ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని నియోజకవర్గంలోని ఇతర గ్రామాలు సైతం అభివృద్ధి, ఆరోగ్యకరమైన వాతావరణం కోసం ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీడీవో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, పోలీసు సిబ్బందితో పాటు సుమారు రెండు వందల మంది గ్రామస్థులు పాల్గొన్నారు.

# చేవెళ్ల నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు

**చేవెళ్ల, మార్చి 16: (సమయం న్యూస్) :** చేవెళ్ల నియోజక వర్గంలోని షాబాద్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య తో కలిసి రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. సోలిపేట గ్రామంలో 40 లక్షల నిధులతో సి.సి రోడ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. సోలిపేట్ గ్రామంలో "గోనె మహేశ్వరి" కి ప్రభుత్వం తరపున ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో వారు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. హైతాబాద్ గ్రామంలో 20 లక్షల నిధులతో సి.సి రోడ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. చందనవెల్లి గ్రామంలో 20 లక్షల నిధులతో సి.సి రోడ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. చందనవెల్లి గ్రామంలో చలివేంద్రం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్దార్ మార్కెట్ చైర్మన్ సురేందర్ రెడ్డి, సర్పంచులు రాజేందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నవనీత స్వామి, శాంతమ్మ యాదయ్య, స్వరూప మహేందర్ గౌడ్, రాజు నాయక్, చెన్నయ్య, మాణిక్యం, నాయకులు జనార్దన్ రెడ్డి, నరేందర్, మహేందర్ రెడ్డి, రమేష్, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాస్, కృష్ణ, వాసిరెడ్డి, సూర్య, శ్రీనివాస్ గౌడ్, ఖాజా మియా, జాంగిర్, సతీష్, బురాన్, మహేష్, గోపాల్, రమేష్, రాఘవేందర్, ప్రశాంత్ పార్టీ కార్యకర్తలు పాలుగోన్నారు.



# ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**కలెక్టరేట్‌లో వినతి**

**నాలుగేళ్లుగా అందని నిధులు.. అవస్థల్లో అధ్యాపక కుటుంబాలు**

**తమను ఆదుకోవాలని కలెక్టర్ కార్యాలయంలో వేడుకోలు**



**పెద్దపల్లి, మార్చి 16 (సమయం న్యూస్) :**
పెద్దపల్లి జిల్లాలోని గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాల అధ్యాపకులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల కాకపోవడం వల్ల బోధన, బోధనేతర సిబ్బంది అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఉన్నత చదువులు పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాలు లేక ప్రైవేటు అధ్యాపకులుగా వివిధ కళాశాలల్లో పనిచేస్తూ కుటుంబాలను పోషిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విధానాల వల్ల యాజమాన్యాలకు సకాలంలో నిధులు అందకపోవడంతో తమకు నెలవారీ జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. సకాలంలో తమ పిల్లల పాఠశాల ఫీజులు కూడా చెల్లించలేని దయనీయ స్థితిలో ఉన్నామని వాపోయారు. ఇదే పరిస్థితి కొనసాగితే అధ్యాపక వృత్తిని వదిలి వెళ్లాల్సి వస్తుందని, తద్వారా తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కావున ప్రస్తుత ప్రజా ప్రభుత్వం వెంటనే స్పందించి యాజమాన్యాలకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, తమ ఉద్యోగాలను కాపాడాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయ పరిపాలనా అధికారి బండి ప్రకాష్‌కు గాయత్రి కళాశాల అధ్యాపక బృందం వినతిపత్రం అందజేసింది.

# ధర్మారం గ్రామానికి బస్సు వచ్చేనా?

**ఎండ తీవ్రతకు విద్యార్థుల అల్లాటప్పా**

**చెట్ల కొమ్మలే గొడుగులుగా మారుతున్న వైనం**



**పిట్లం, మార్చి 16 (సమయం న్యూస్):**
కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం పిట్లం మండలంలోని ధర్మారం గ్రామ విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. వేసవి కాలం వచ్చిందంటే చాలు ఈ గ్రామానికి చెందిన విద్యార్థులకు చెట్ల కొమ్మలే రక్షణ కల్పిస్తున్నాయి. గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ప్రతిరోజూ ధర్మారం నుండి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న కొడప్‌గల్ పాఠశాలకు కాలినడకన వెళ్లాల్సి వస్తోంది. మండుతున్న ఎండల తీవ్రతను తట్టుకోలేక చిన్నారి విద్యార్థులు చెట్ల కొమ్మలను గొడుగుల్లా కప్పుకొని ప్రయాణం సాగిస్తున్నారు.

ఈ విషయంపై ధర్మారం గ్రామ బీజేపీ నాయకులు విట్టల్ మాట్లాడుతూ.. దశాబ్దాలు గడిచినా, ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ ఊరి కష్టాలను పట్టించుకున్న నాయకులే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎమ్మెల్యేకు పలుమార్లు విన్నవించినా ఈ సమస్యపై ఏమాత్రం స్పందించలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని, విద్యార్థుల కష్టాలను తీర్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# చేవెళ్ల మున్సిపాలిటీలో ఇఫ్తార్ విందు



**చేవెళ్ల, మార్చి 16: (సమయం న్యూస్) :** చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని అట్లాస్ ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమం మరియు ముస్లిం సోదరులకు రంజన్ కిట్టులను పంపిణీ చేసిన చేవెళ్ల శాసనసభ్యులు శ్రీ కాలే యాదయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ సోదరులతో కలిసి ఇఫ్తార్ ప్రార్థనల్లో పాల్గొని, వారికి రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించా

**పటాన్‌చెరు,(సమయం న్యూస్) :** జిన్నారం మున్సిపల్ పరిధిలోని పెద్దమ్మగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు భక్తుల కోలాహలం మధ్య వైభవంగా సాగుతున్నాయి. ఈ వేడుకల్లో సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. లోక కల్యాణం జరగాలని, గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆ పరమేశ్వరుడిని వేడుకున్నట్లు తెలిపారు. గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో నిర్వహించిన శ్రీ మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్‌తో కలిసి హాజరయ్యారు. స్వామివారి కళ్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

# పాక్ క్రికెట్‌లో సంక్షోభం

## అల్లుడిని టార్గెట్ చేసిన షాహీద్ అఫ్రిది.. • బంగ్లాదేశ్ చేతిలో పాక్ ఘోర పరాజయం..

### పాక్ సెలక్టర్లు, అల్లుడిపై షాహీద్ అఫ్రిది విమర్శలు





**ఢిల్లీ:** ఇటీవల టీ20 వరల్డ్ కప్‌లో ఘోర పరాజయాలు మరవకముందే, పాకిస్తాన్ జట్టు బంగ్లాదేశ్ చేతిలో దారుణంగా ఓడిపోయింది. బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను 2-1 తేడా పాకిస్తాన్ పరాజయాలను చవిచూసింది. దీంతో పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు ఆటగాళ్లు, సెలక్షన్ కమిటీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. పాక్ మాజీ స్టార్ షాహీద్ అఫ్రిది, తన అల్లుడు అని చూడకుండా షాహీన్ అఫ్రిదిపై విమర్శలు గుప్పించారు. ఆదివారం జరిగిన మూడో వన్డేలో సల్మాన్ అలీ ఆఘా నేతృత్వంలోని పాక్ టీమ్ ఓడిపోయింది. ఓటమి తర్వాత షాహీద్ అఫ్రిది ఒక వీడియోలో మాట్లాడుతూ.. బాబర్ అజమ్‌ను జట్టు నుంచి తప్పించడంతో పాటు తన అల్లుడు షహీన్ అఫ్రిదికి కెప్టెన్సీ అప్పగించాలనే నిర్ణయాన్ని ప్రశ్నించారు. పాక్ జట్టులో సర్జరీల పేరుతో నాశనం చేస్తున్నారని పీసీబీ సెలెక్టర్లపై షాహిద్ అఫ్రిది మండిపడ్డారు. “మీరు 2026 ౨20 ప్రపంచ కప్‌లో ప్రదర్శనలను చూశారు, ఆ తర్వాత మేము బంగ్లాదేశ్ సిరీస్‌ను కూడా 2--1తో కోల్పోయాము. నా అభిప్రాయం ప్రకారం, సెలక్షన్ కమిటీ విమర్శలకు అర్హమైనది. కమిటీలోని మీరందరూ చాలా క్రికెట్ ఆడారు, అయినప్పటికీ ఏ ఫార్మాట్‌కు ఎవరు కెప్టెన్‌గా ఉండాలో మీకు ఇంకా ఆలోచన ఉన్నట్లు లేదు” అని అఫ్రిది అన్నారు. “మీరు సర్జరీల పేరుతో చాలా నిర్ణయాలు తీసుకుంటున్నారు. పాకిస్థాన్ దేశవాళీ క్రికెట్ ప్రమాణాలు అంతర్జాతీయ స్థాయికి సరిపోవు, అలాంటి చోట రెండు మూడు మ్యాచ్‌లు ఆడిన వారికి నేరుగా పాకిస్థాన్ క్యాప్ ఇవ్వడం ఏంటి?” అని ప్రశ్నించారు. సీనియర్ ఆటగాళ్లు టీ20 వరల్డ్ కప్‌లో మంచి ప్రదర్శన చేయనప్పటికీ, వన్డేల్లో మంచి రికార్డులు కలిగి ఉన్నారని, అలాంటి వారిని పక్కన పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పాకిస్థాన్-బంగ్లాదేశ్ మ్యాచ్‌లో మరో వివాదం..

### వైడ్ బాల్‌కి రివ్యూ, ఐసీసీకి ఫిర్యాదు!




**ఢిల్లీ:** మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఢాకా వేదికగా ఆదివారం పాకిస్థాన్-బంగ్లాదేశ్ మధ్య జరిగిన మూడో వన్డేలో వివాదం చోటుచేసుకుంది. మ్యాచ్ చివరి ఓవర్‌లో జరిగిన ఒక ఘటన ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అంపైర్ తీసుకున్న నిర్ణయం, దానిపై బంగ్లాదేశ్ జట్టు తీసుకున్న రివ్యూ కారణంగా రెండు జట్ల మధ్య వివాదం తలెత్తింది. ఇప్పటికే ఈ సిరీస్‌లోని రెండో వన్డే మ్యాచ్‌లో పాక్ బ్యాటర్ సల్మాన్ అలీ అఘా రనౌట్ తీవ్ర వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. పాకిస్తాన్ విజయానికి చివరి ఓవర్‌లో 14 రన్స్ అవసరం అయ్యాయి. ఆ ఓవర్‌ను బంగ్లా స్పిన్నర్ రిషాద్ వేశాడు. తొలి రెండు బంతులకు రిషాద్ పరుగులు ఇవ్వలేదు. మూడో బంతికి రెండు రన్స్ వచ్చాయి. నాలుగో బంతికి పరుగేమీ రాలేదు. ఐదో బాల్‌ని రిషాద్ లెగ్ సాధించగా.. బంతిని షాహీన్ ఆఫ్రిది డౌన్ ది లెగ్ ఆడటానికి ప్రయత్నించాడు. షాట్ కనక్ట్ కాలేదు. దీంతో ఫీల్డ్ అంపైర్ వైడ్‌గా ప్రకటించాడు. వికెట్ కీపర్ లిట్టన్ దాస్ సూచన మేరకు బంగ్లా కెప్టెన్ రివ్యూ తీసుకున్నాడు. ఇక్కడే వివాదం చోటు చేసుకుంది. రివ్యూలో బంతి వైడ్ కాదని, సరైన బంతేనని థర్డ్ అంపైర్ తేల్చాడు. ఈ ఘటన తర్వాత పాకిస్థాన్ ప్లేయర్స్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బంగ్లా ఆటగాళ్లు మైదానంలోని బిగ్ స్క్రీన్‌పై రీప్లే చూసిన తర్వాతే.. రివ్యూకి వెళ్లారని పాక్ ఆరోపించింది. ఫీల్డ్ అంపైర్ నిర్ణయం అనంతరం 15 సెకన్లలోపే డీఆర్ఎస్ కోరాలని, నిర్ణీత సమయం ముగిసిన తర్వాత కూడా రివ్యూకు అంపైర్ అనుమతించడంపై పాక్ అసహనం వ్యక్తం చేసింది. ఇది మ్యాచ్ నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది. ఈ విషయంపై ఐసీసీకి పీసీబీ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ వివాదంపై ఐసీసీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.




# నేను మనిషినే..

## నేను కూడా తప్పులు చేసి ఉండొచ్చు..

### విరాట్, రోహిత్ వివాదంపై గంభీర్ వ్యాఖ్యలు

**ముంబై:** టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. స్టార్ ప్లేయర్స్ విరాట్ కోహ్లీ మరియు రోహిత్ శర్మకు ఎప్పుడూ పొసగదని.. వారి మధ్య ఏదో జరుగుతుందని పుకార్లు షికార్లు చేయగా.. కొన్ని సార్లు అది బహిర్గతం కూడా అయ్యింది.. అయితే, విరాట్, రోహిత్‌తో తన సంబంధాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు గంభీర్.. గత కొంతకాలంలో తాను కూడా కొన్ని తప్పులు చేసి ఉండవచ్చని ఆయన అంగీకరించారు. అంతేకాదు.. నేను మనిషినే.. నేను కూడా తప్పులు చేసి ఉండొచ్చు అని పేర్కొన్నారు..

### రెవ్‌స్పోర్ట్జ్ కాన్‌క్లేవ్‌లో గంభీర్ వ్యాఖ్యలు

మార్చి 16న కోల్‌కతాలో జరిగిన RevSportz Conclaveలో మాట్లాడిన టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. ఆటగాళ్లతో వ్యవహరించే విషయంలో తీసుకున్న నిర్ణయాలు ఎల్లప్పుడూ మంచి ఉద్దేశ్యంతోనే తీసుకున్నానని తెలిపారు. “నేను కూడా మనిషినే. నేను తప్పులు చేయొచ్చు. ఆటగాళ్లకు కూడా తప్పులు చేసే హక్కు ఉంది. గత 18 నెలల్లో నేను కొన్ని తప్పులు చేసి ఉండవచ్చు. కానీ, నా ఉద్దేశాలు ఎప్పుడూ సరైనవే. మంచి ఉద్దేశ్యంతో తీసుకున్న తప్పుడు నిర్ణయాన్ని అంగీకరించవచ్చు. అయితే, చెడు ఉద్దేశ్యంతో తీసుకున్న నిర్ణయం మాత్రం డ్రెస్సింగ్ రూమ్‌లో ఎప్పటికీ ఆమోదయోగ్యం కాదు” అని గంభీర్ అన్నారు. అంతేకాదు.. డ్రెస్సింగ్ రూమ్ ముందు నిలబడి ఆటగాళ్ల కళ్లలోకి చూసి నిజాయితీగా మాట్లాడగలిగితేనే కోచ్‌గా తన బాధ్యతను సరిగ్గా నిర్వర్తిస్తున్నానని గంభీర్ పేర్కొన్నారు.

### కోహ్లీ, రోహిత్ రిటైర్మెంట్ తర్వాత మార్పులు

గంభీర్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన కొన్ని నెలలకే విరాట్ కోహ్లీ మరియు రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. ఈ నిర్ణయం 2024-25లో జరిగిన.. Border-Gavaskar Trophyలో భారత జట్టు నిరాశపరిచిన ప్రదర్శన తర్వాత వచ్చింది. అలాగే న్యూజిలాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో కూడా భారత్ ఆశించిన ఫలితాలు సాధించలేదు. దీంతో బీసీసీఐ జట్టు ప్రదర్శనను సమీక్షించి కొన్ని కొత్త మార్గదర్శకాలను అమలు చేసింది.

### యువ ఆటగాళ్లకు అవకాశాలు

కోహ్లీ, రోహిత్ టెస్ట్ క్రికెట్ నుంచి తప్పుకున్న తర్వాత భారత టెస్ట్ జట్టులో మార్పుల దశ ప్రారంభమైంది. యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వగా, శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. గంభీర్, గిల్ నాయకత్వంలో భారత్ ఇంగ్లాండ్ పర్యటనలో టెస్ట్ సిరీస్‌ను డ్రా చేసుకుంది. అలాగే స్వదేశంలో వెస్టిండీస్‌పై విజయం సాధించింది. అయితే దక్షిణాఫ్రికాతో జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో జట్టు పరాజయం చవిచూసింది. మరోవైపు.. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ.. భారత జట్టుకు వన్డే ఫార్మాట్‌లో మాత్రమే ఆడుతున్నారు. ఇద్దరూ ICC Cricket World Cup 2027పై దృష్టి సారించారు. అయితే, ప్రపంచకప్ జట్టులో వారి స్థానం ప్రదర్శన ఆధారంగానే నిర్ణయిస్తామని జట్టు మేనేజ్‌మెంట్, సెలెక్టర్లు స్పష్టం చేశారు.



# గేల్ 175 రికార్డును బద్ధలు కొడతా

### వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ ధీమా

**న్యూఢిల్లీ, మార్చి 16:** ఐపీఎల్ చరిత్రలో ‘యూనివర్స్ బాస్’ క్రిస్ గేల్ నెలకొల్పిన 175 పరుగుల భారీ స్కోరు రికార్డును బద్ధలు కొట్టడమే తన లక్ష్యమని టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ధీమా వ్యక్తం చేశాడు. ఆదివారం ఢిల్లీలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అట్టహాసంగా నిర్వహించిన ‘నమన్ అవార్డుల’ వేడుకలో ఈ 14 ఏళ్ల కుర్రాడు తన భవిష్యత్తు ప్రణాళికలను వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. టీమిండియా స్టార్స్ సంజు శాంసన్, హార్దిక్ పాండ్యా, అభిషేక్ శర్మలతో కలిసి వేదికను పంచుకున్న ఈ బీహార్ యువ కిరణం, ప్రముఖ వ్యాఖ్యాత హర్ష భోగ్లే అడిగిన ప్రశ్నకు తడుముకోకుండా సమాధానమిచ్చాడు. ఐపీఎల్‌లో నీవు బద్ధలు కొట్టాలనుకుంటున్న అతిపెద్ద రికార్డు ఏది అని హర్ష భోగ్లే అడగ్గా, 2013లో పూణే వారియర్స్‌పై గేల్ సాధించిన చారిత్రాత్మక స్కోరును అధిగమించడమే తన లక్ష్యమని వైభవ్ తన ఆత్మవిశ్వాసాన్ని చాటాడు. వైభవ్ మాటలు కేవలం అతిశయోక్తి కాదని అతని ఇటీవలి గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2026 అండర్-19 ప్రపంచకప్ ఫైనల్‌లో ఇంగ్లాండ్‌పై వైభవ్ సృష్టించిన విధ్వంసం క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. కేవలం 80 బంతుల్లోనే 15 ఫోర్లు, 15 సిక్సర్లతో 175 పరుగులు సాధించి, అండర్-19 వరల్డ్ కప్ ఫైనల్ చరిత్రలోనే అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేసిన ఆటగాడిగా నిలిచాడు. అతని అద్భుత బ్యాటింగ్ వల్లే భారత్ రికార్డు స్థాయిలో ఆరోసారి ఛాంపియన్‌గా నిలిచింది. ఇప్పటికే ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న వైభవ్, 2025 సీజన్‌లో కేవలం 14 ఏళ్ల 32 రోజుల వయసులో గుజరాత్ టైటాన్స్‌పై సెంచరీ సాధించి చరిత్ర సృష్టించాడు. 35 బంతుల్లోనే వంద పరుగులు పూర్తి చేసి, క్రిస్ గేల్ తర్వాత ఐపీఎల్‌లో అత్యంత వేగంగా సెంచరీ చేసిన రెండో ఆటగాడిగా, అలాగే ఒక భారతీయుడిగా ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న ఐపీఎల్ 2026లో ఈ యువ వండర్ కిడ్ మరెన్ని సంచలనాలు సృష్టిస్తాడో అని విశ్లేషకులు మరియు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# సెల్వ ప్రభుకు రజతం




**న్యూఢిల్లీ:** అమెరికా వేదికగా జరిగిన ఎన్‌సీఏఏ ఇండోర్ చాంపియన్‌షిప్‌లో భారత యువ అథ్లెట్ సెల్వ ప్రభు రజత పతకంతో మెరిశాడు. ఆదివారం జరిగిన పురుషుల ట్రిపుల్‌జంప్ ఫైనల్లో సెల్వ ప్రభు 17.05మీటర్ల ఎత్తు దూకి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. వరల్డ్ అథ్లెటిక్స్ అండర్-20 టోర్నీ రజత విజేత అయిన ప్రభు జాతీయ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ ముందుకు సాగిన ప్రభు రెండో స్థానంలో నిలిచి సత్తాచాటాడు. జాతీయ అథ్లెటిక్స్ ఫెడరేషన్(ఏఎఫ్ఐ) కఠినమైన డోపింగ్ నిబంధనలతో అథ్లెట్లు తమ జాతీయ రికార్డుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు.

# పాక్ క్రికెటర్ కొనుగోలుపై విమర్శలు..

### కావ్య మారన్‌ను నిలదీసిన గవాస్కర్

**ఢిల్లీ:** ఐపీఎల్ కోసం.. పాకిస్తాన్ క్రికెటర్‌ను కొనుగోలు చేసిన విషయంపై సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఈ నిర్ణయంపై భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ స్పందిస్తూ ఫ్రాంచైజీ యాజమాన్యంపై ప్రశ్నల వర్షం కురిపించారు.. ఇంగ్లాండ్‌లో నిర్వహించే ఫ్రాంచైజీ టోర్నమెంట్ ది హండ్రెడ్ కోసం జరిగిన ఆటగాళ్ల వేలంలో, సన్‌రైజర్స్ లీడ్స్ పాకిస్తాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ ను సుమారు రూ.2.34 కోట్లుకు కొనుగోలు చేసింది. సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు జాబఅ +తీశీబజూ యాజమాన్యంలో ఉంది. ఇదే సంస్థ ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లోని సన్‌రైజర్ హైదరాబాద్‌జట్టును కూడా నిర్వహిస్తోంది. ఈ నిర్ణయంపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. భారతదేశం-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో పాకిస్తాన్ ఆటగాడిని కొనుగోలు చేయడం ఎందుకు అన్న ప్రశ్నలు లేవనెత్తారు. వేలం సమయంలో హాజరైన ఫ్రాంచైజీ సీఈవో కార్య మారన్ కూడా విమర్శలకు గురయ్యారు.







### గవాస్కర్ తీవ్ర వ్యాఖ్యలు

ఈ అంశంపై తన కాలమ్‌లో స్పందించిన సునీల్ గవాస్కర్, గత కొన్ని సంవత్సరాల్లో భారత్-పాకిస్తాన్ మధ్య జరిగిన సంఘటనలను పరిగణలోకి తీసుకుంటే ఇటువంటి ప్ర తి చ ర్య న ప ా జ వ ం ని పేర్కొన్నారు. 2008లో జరిగిన 2008 ముంబై దాడుల తర్వాత పాకిస్తాన్ ఆటగాళ్లను ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఆడనివ్వలేదని ఆయన గుర్తు చేశారు. అలాగే 2019లో జరిగిన పుల్వామ అటాక్‌వంటి ఘటనలు భారతదేశంలో ప్రజల భావోద్వేగాలను ప్రభావితం చేశాయని తెలిపారు. భారత యాజమాన్యంలో ఉన్న జట్టు పాకిస్తాన్ ఆటగాడికి చెల్లించే డబ్బు అక్కడ పన్నుల రూపంలో ప్రభుత్వానికి చేరుతుందని, ఆ నిధులను ఆయుధాల కొనుగోలుకు ఉపయోగించే అవకాశముందని గవాస్కర్ అభిప్రాయపడ్డారు. భారత యజమాని ఒక పాకిస్తాన్ ఆటగాడికి డబ్బు చెల్లిస్తే, అది పరోక్షంగా భారత సైనికులు లేదా పౌరులపై ప్రభావం చూపే వ్యవస్థకు నిధులు సమకూర్చినట్టే అవుతుంది. ఒక టోర్నమెంట్ గెలవడం భారతీయుల ప్రాణాల కంటే ముఖ్యమా?” అని ఆయన ప్రశ్నించారు.

# ఆస్కార్ అవార్డుల వేడుకల్లో అరుదైన సంఘటన



## ఆస్కార్ అవార్డును సమానంగా గెలుచుకున్న రెండు సినిమాలు

అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో జరిగిన 98వ చోటు చేసుకుంది. దాదాపు 14 ఏళ్ల తర్వాత ఒకే విభాగంలో రెండు సినిమాలు సమానంగా నిలిచి ఆస్కార్ అవార్డును గెలుచుకున్నాయి. దీంతో డాల్బీ థియేటర్‌లో జరిగిన వేడుకలో ఈ సంఘటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిలిం' కేటగిరీలో 'ది సింగర్స్' మరియు 'టు పీపుల్ ఎక్స్ఛేంజ్ సలైవా' చిత్రాలు సంయుక్తంగా విజేతలుగా నిలిచాయి. ఈ అవార్డును ప్రకటించడానికి ప్రజెంటర్ కుమాయిల్ నంజియాని స్టేజ్‌పైకి వచ్చారు. అయితే ఎన్వలప్ తెరిచిన తర్వాత కొద్దిసేపు ఏమీ చెప్పకుండా ఉడడంతో అక్కడున్న వారందరూ ఆశ్చర్యపోయారు. కొద్దిసేపటి తర్వాత ఆయన ఈ కేటగిరీ టై అయిందని, ఇద్దరు విజేతలు అవార్డును గెలుచుకున్నారని ప్రకటించారు. దీంతో డాల్బీ థియేటర్ మొత్తం చప్పట్లతో మార్మోగిపోయింది. ఆస్కార్ చరిత్రలో ఇలా ఒకే విభాగంలో ఇద్దరు విజేతలు రావడం ఇది ఏడోసారి కావడం విశేషం. అంతేకాకుండా 2012 తర్వాత మళ్లీ ఈ తరహా టై నమోదు కావడం ఇదే మొదటిసారి. అవార్డు ప్రకటించిన తర్వాత కుమాయిల్ నంజియాని సరదాగా స్పందిస్తూ, షార్ట్ ఫిలిం అవార్డు ఇవ్వడానికి ఇప్పుడు రెట్టింపు సమయం పడుతుంది

### ఆస్కార్ చరిత్రలో టై అయిన సందర్భాలు

1932 ఉత్తమ నటుడు (వాలెస్ బీరీ, ఫ్రెడ్రిక్ మార్చ్)
1949 బెస్ట్ డాక్యుమెంటరీ (ఏ ఛాన్స్ టు లివ్, సో మచ్ ఫర్ సో లిటిల్)
1968 ఉత్తమ నటి (కేథరిన్ హెప్బర్న్, బార్బరా స్ట్రీసాండ్)
1986 బెస్ట్ ఫీచర్ డాక్యుమెంటరీ (ఆర్టీ షా: టైమ్ ఈజ్ ఆల్ యూ హావ్ గాట్, డౌన్ అండ్ అవుట్ ఇన్ అమెరికా)
1994 బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిలిం (ఫ్రాంక్ కాఫ్కాస్ ఇట్స్ ఏ వండర్ ఫుల్ లైఫ్, ట్రెవర్)
2012 ఉత్తమ సౌండ్ ఎడిటింగ్ (స్కైఫాల్, జీరో డార్క్ థర్టీ)
2026 బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిలిం (ది సింగర్స్, టు పీపుల్ ఎక్స్ఛేంజ్ సలైవా)

మొత్తానికి ఆస్కార్ 2026 వేడుకల్లో జరిగిన ఈ అరుదైన సంఘటన ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని ఇచ్చింది. ఒకే కేటగిరీలో రెండు సినిమాలు విజేతలుగా నిలవడం సినీ ప్రపంచంలో అరుదైన ఘట్టంగా నిలిచింది.

## ఆస్కార్‌లో ధర్మేంద్ర, కోటలకు నివాళి

అద్భుతమైన నటనతో కోట్ల మంది అభిమానులను సొంతం చేసుకొని.. గతేడాదిలో తుదిశ్వాస విడిచిన నటీనటులకు ఆస్కార్ నివాళులర్పించింది. లాస్ ఏంజెలెస్‌లో జరిగిన 98వ ఆస్కార్ అవార్డుల వేడుకలో ప్రపంచవ్యాప్తంగా సినీరంగం కోసం కృషి చేసిన గొప్ప కళాకారులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా హాలీవుడ్ ప్రముఖులతో పాటు భారతీయ సినిమా నుంచి ధర్మేంద్ర, మనోజ్ కుమార్, బి.సరోజాదేవి, కోట శ్రీనివాసరావు వంటి దిగ్గజాల పేర్లను అకాడమీ తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రత్యేకంగా పొందుపరిచింది. ఆస్కార్ వేడుక ప్రారంభంలో గతేడాది మరణించిన హాలీవుడ్ ప్రముఖులకు నివాళులర్పిస్తూ వీడియోను ప్రదర్శించారు. వారిని స్మరించుకుంటూ వారితో ఉన్న జ్ఞాపకాల గురించి కొందరు వేదికపై మాట్లాడారు. అయితే, ఆ వీడియోలో ధర్మేంద్రను చూపించకపోవడంతో అభిమానులు అసహనం వ్యక్తంచేస్తూ ఎక్స్ వేదికగా పోస్ట్‌లు పెట్టారు. సమయాభావం వల్ల వీడియోలో కొందరినే చూపారని.. ఆ తర్వాత అందరి పేర్లను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారని హాలీవుడ్ మీడియా పేర్కొంది. 89 ఏళ్ల వయసులో గతేడాది నవంబర్ 24న ధర్మేంద్ర తుదిశ్వాస విడిచారు. సినీ పరిశ్రమకు ఆయన చేసిన సేవలను గుర్తించిన కేంద్రం పద్మ విభూషణ్‌తో సత్కరించింది. ఇక 40 ఏళ్ల సుదీర్ఘ సినీ కెరీర్ కలిగిన కోట శ్రీనివాసరావు గతేడాది జులై 13న మరణించిన విషయం తెలిసిందే.







## వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్

### ఆస్కార్‌లు పండించిన మూవీ

### ఏకంగా ఆరు ఆస్కార్‌లు ప్రదానం

కథలో బలం, పాత్రల మధ్య సంఘర్షణ ఉండాలే గానీ.. బాక్సాఫీసు లెక్కలతో పని లేకున్నా పురస్కారాల పంట పండుతుందని వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ సినిమా నిరూపించింది. సినీ రంగం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే అకాడమీ అవార్డుల్లో ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా ఆరు 'ఆస్కార్ లు అందుకుంది. బిడ్డ నమ్మకం గెలుచుకోవడం కోసం ఓ తండ్రి పడే తపనను హృద్యంగా తీర్చిదిద్ది ఉత్తమ దర్శకుడిగానూ అవార్డు అందుకున్నారు పాల్ థామస్ అండర్సన్. బ్లాక్ కామెడీ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రంలో లియోనార్డో డికాప్రియో కీలక పాత్ర పోషించారు. విప్లవకారుల గ్రూప్ ఫ్రెంచ్ 75లో సభ్యులైన ప్యాట్ కల్వాన్ (లియోనార్డో డికాప్రియో), పెర్ఫిడియా బేవర్లీ హిల్స్ (టియానా టేలర్) సహజీవనంలో ఉంటారు. ఓ నిర్బంధ కేంద్రం నుంచి వలసదారులను విడిపించే క్రమంలో అక్కడి కమాండింగ్ అధికారి స్టీవెన్‌ను పెర్ఫిడియా అవమానిస్తుంది. దీంతో వీరిద్దరిపైనా అతడు పగ పెంచుకుంటాడు. ఆ తర్వాత ఓ కేసులో ఆమెను పట్టుకున్న స్టీవెన్.. తనతో ఏకాంతంగా గడిపితే విడిచిపెడతానని షరతు పెడతాడు. ఇందుకు పెర్ఫిడియా అంగీకరిస్తుంది. కొంతకాలానికి ఆమె బిడ్డకు జన్మిస్తుంది. కానీ, ఆ చిన్నారిని, తన భాగస్వామి ప్యాట్‌ను వదిలేసి మళ్లీ విప్లవం బాట పడుతుంది. ఈ క్రమంలోనే స్టీవెన్ సాయంతో మెక్సికోకు వెళ్లిపోతుంది. దీంతో ప్యాట్ ఒంటరి తండ్రిగా చిన్నారి చార్లీన్‌ను పెంచుతాడు. ఈ క్రమంలో వారికి ఎన్నో అవమానాలు ఎదురవుతాయి. మరోవైపు.. అవినీతి అధికారి అయిన స్టీవెన్ అమెరికా సెక్యూరిటీ ఏజెన్సీస్‌లో అగ్రస్థాయికి ఎదుగుతాడు. 16ఏళ్ల తర్వాత పెర్ఫిడియా జన్మనిచ్చిన చిన్నారికి తానే అసలైన తండ్రినని తెలుసుకున్న స్టీవెన్.. ఆమెను చంపేందుకు కుట్రలు పన్నుతాడు. ఈ విషయం తెలుసుకున్న ప్యాట్ అలియాస్ బాబ్.. ఇన్నాళ్లూ సొంతబిడ్డగా పెంచుకున్న చార్లీన్‌ను కాపాడేందుకు ఏం చేస్తాడు? ఆ పోరాటంలో అతని ఆలోచనలు, సంబంధాలు, నైతిక విలువలు ఎలా మారతాయి? స్వార్థం తన పరిస్థితులను ఎలా మార్చేసింది? తల్లి మీద కోపం, పెంచిన తండ్రి మీద అనుమానంతో ఎటూ తేల్చుకునే స్థితిలో ఉన్న చార్లీన్ నమ్మకాన్ని ప్యాట్ ఎలా గెలుచుకోగలిగాడు? అన్నదే ఈ చిత్ర కథ. 2000 నాటి వైన్‌లాండ్ నవల ఆధారంగా దర్శకుడు పాల్ థామస్ అండర్సన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. గతేడాది సెప్టెంబరు 26న వార్నర్ బ్రదర్స్ నిర్మాణ సంస్థ ఈ సినిమాను విడుదల చేసింది. బాక్సాఫీసు వద్ద కాసుల వర్షం కురిపించకపోయినా.. అండర్సన్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా నిలిచింది. అటు విమర్శకుల ప్రశంసలతో పాటు అనేక పురస్కారాలు సాధించింది. తాజాగా జరిగిన ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డుల్లో మొత్తం 13 విభాగాల్లో ఈ సినిమా నామినేషన్లలో నిలిచింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ సహాయ నటుడు, ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే, ఉత్తమ క్యాస్టింగ్, ఉత్తమ ఎడిటింగ్ విభాగాల్లో ఆరు పురస్కారాలు అందుకుంది. తండ్రి పాత్రలో లియో తన బిడ్డ కోసం పడే తపన ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తుంది. ప్రస్తుతం ఈ సినిమా హాట్‌స్టార్, అమెజాన్ ప్రైమ్ వీడియోలో అందుబాటులో ఉంది.

## పగలు రాత్రి తేడా పని చేశా

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో రూపొందుతున్న భారీ చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఉగాది కానుకగా మార్చి 19న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర కథానాయిక రాశీ ఖన్నా మీడియాతో పంచుకున్నారు.' నా కెరీర్ ఆరంభం నుంచే పవన్ కళ్యాణ్ గారి స్టార్డమ్, ఆయనకున్న 'పవనిజం' గురించి విన్నాను. ఆయనతో ఒక్క సినిమా అయినా చేయాలని కోరుకున్నాను, ఈ చిత్రంతో నా కల నెరవేరింది. పవన్ గారు చాలా నిరాడంబరంగా ఉంటారు, సెట్‌లో ఎప్పుడూ పుస్తకాలు చదువుతూ కనిపిస్తారు. ఆయనలోని మానవత్వం, ప్రజల పట్ల ఆయనకున్న ఆలోచనలు నన్ను ఎంతో ప్రభావితం చేశాయి. ఈ సినిమాలో నేను 'శ్లోక' అనే మోడరన్ అమ్మాయి పాత్రలో కనిపిస్తాను. ప్రతి పాత్రకు ప్రాధాన్యత ఉండేలా దర్శకుడు హరీష్ శంకర్ డిజైన్ చేశారు. నాకు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం, ఇందులో ఒక మాస్ సాంగ్ ఉంది, దాని షూటింగ్‌ను చాలా ఎంజాయ్ చేశాను. శ్రీలీల, నేను ఇద్దరం హీరోయిన్లము అయినప్పటికీ, ఎవరి ప్రాధాన్యత వారికుంది. దర్శకుడు హరీష్ శంకర్ గారికి మాస్ పల్స్ బాగా తెలుసు. సాధారణంగా 120 రోజులు పట్టే షూటింగ్‌ను తన ప్లానింగ్‌తో కేవలం 40 రోజుల్లోనే పూర్తి చేశారు. ఆయన అంకితభావం చూసి ఆశ్చర్యపోయాను. సెట్‌లోనే అప్పటికప్పుడు పంచ్ డైలాగ్స్ రాయడం ఆయన స్పెషాలిటీ. పవన్ కళ్యాణ్ గారి బిజీ షెడ్యూల్స్ వల్ల షూటింగ్ సమయంలో కొన్ని సర్దుబాట్లు చేయాల్సి వచ్చింది. పగలు, రాత్రి తేడా లేకుండా వరుసగా 24 గంటల షిఫ్టులు కూడా పని చేశాను. అయినా సరే, అటు పవన్ గారు, ఇటు మైత్రి మూవీ మేకర్స్ వంటి పెద్ద బ్యానర్‌లో పని చేయడం వల్ల ఆ కష్టం తెలియలేదు. ఈ సినిమా ఒక కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. 'గబ్బర్ సింగ్' చిత్రంలో పవన్ కళ్యాణ్ గారిని ఎలాగైతే చూశారో, మళ్ళీ అదే వింటేజ్ లుక్, ఎనర్జీని ఈ సినిమాలో చూస్తారు. ఉగాది పండుగ రోజున థియేటర్లలో ప్రేక్షకులకు ఇది ఒక విందు భోజనంలా ఉంటుంది.





## ఆస్కార్‌లో మెరిసిన ఈషా అంబానీ

సినీ రంగ ప్రతిష్టాత్మక వేడుక 'ఆస్కార్ 2026' అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకలో ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ తనయ ఈషా అంబానీ సందడి చేశారు. వింటేజ్ వాలెంటినో గౌన్‌లో రెడ్ కార్పెట్‌పై మెరిశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. తన భర్త ఆనంద్ పిరమాల్‌తో కలిసి ఈషా అంబానీ ఆస్కార్ వేడుకకు హాజరయ్యారు. ఈషా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ ఈవెంట్‌కు ముందు ఈషా అంబానీ అకాడమీ మ్యూజియం ఆఫ్ మోషన్ పిక్చర్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఈ మ్యూజియంతో నీతా ముకేశ్ అంబానీ కల్చర్ సెంటర్ కలిసి పనిచేసే అంశాన్ని ఆమె చర్చించినట్లు సమాచారం. భారతీయ సంస్కృతిని అంతర్జాతీయ వేదికపై ప్రతిబింబించడంతో పాటు ఇండియన్ సినిమాకు మరింత గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా ఈషా అంబానీ ఈ వేడుకలో పాల్గొన్నారు. ఆస్కార్ అవార్డుల కార్యక్రమంలో ఈషా పాల్గొనడం ఇదే తొలిసారి. ఆ మధ్య ఈమె మెట్ గాలాలో సందడి చేసిన సంగతి తెలిసిందే

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**